


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 139, పేజీలు - 08

మంగళవారం, అక్టోబర్ 28, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## బండ్లగూడ భూదోపిడిలో కొత్తకోణం

**ప్రభుత్వ భూమితో బ్యాంకులకు, ప్రజలకు ద్విముఖ వంచన!**

- దొంగ పత్రాలతో జాతీయ బ్యాంకుల్లో కోట్లు రుణం..
- 'పల్లవి డిబిఆర్' పేరుతో అమాయకులకు ప్లాట్ల విక్రయం
- అధికారుల అండతో అక్రమార్కుల బరితెగింపు..
- సిబిఐ, ఆర్బిఐ రంగంలోకి దిగాల్సిందే!
- అక్రమ అనుమతులు రద్దు చేసి, రిజిస్ట్రేషన్లు ఆపాలి
- సామాజిక కార్యకర్త బాబా గౌడ్ డిమాండ్

*అవినీతి అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలు మరియు ఎన్‌ఓసీలను అడ్డం పెట్టుకుని, డి. భాస్కర్ రెడ్డి బృందం సర్వే నెం. 36/5 లోని ప్రభుత్వ భూమిపై జాతీయ, ప్రైవేట్ బ్యాంకుల నుండి కోట్ల రూపాయల మేర రుణాలు పొందింది. వాస్తవానికి అది ప్రభుత్వ భూమి అని, దానికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కు లేదని తెలిసి కూడా, దొంగ కాగితాలను బ్యాంకుల్లో తనఖా పెట్టి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు.*

వివరాలు 2లో..

## జూబ్లీహిల్స్‌లో హోరా హోరీ ప్రచారం

### - టఫ్ ఫైట్ లో గెలిచేది ఎవరు.?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ప్రచారం హోరా హోరీగా సాగుతుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అన్ని రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారడంతో ప్రధాన పార్టీల నేతలు నువ్వా నేనా అన్నట్టు ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. ప్రధానపార్టీలు- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల నాయకులు నియోయజక వర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

**- ప్రచారం వేగవంతం చేసేలా ప్లాన్ చేసిన కాంగ్రెస్**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ యూసఫ్ గూడా డివిజన్ ముఖ్యనాయకుల సమావేశాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పలువురు శాసనసభ్యులు డివిజన్ ప్రెసిడెంట్ ఫిరోజ్ ఖాన్ సహా పలువురు హాజరయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ప్రచారాన్ని వేగవంతం చేసేలా కార్యాచరణ ను చర్చించినట్లు పొన్నం ప్రభాకర్ చెప్పారు.

**- కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో సీతక్క**

కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించాలని, స్థానిక కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలనీ చర్చించినట్లు, పోలింగ్ శాశం పెంచేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు

2లో..

## బాకీ కార్డు ఉద్యమాన్ని ముమ్మరం చేసిన బీఆర్ఎస్

### - ఆటోడ్రైవర్లకు రూ.24 వేలు చెల్లించాలని డిమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, చేతగాని హామీలు ఎవరు ఇవ్వమన్నారు? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. బన్సీలాల్ పేటలోని జబ్బార్ కాంప్లెక్స్ నుండి స్వయంగా ఆటో డ్రైవింగ్ చేసి, అక్కడి ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**- కాంగ్రెస్ మోసపూరిత హామీలు**

ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్లను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పుడు రెండేళ్లు పూర్తయినా ఆ మొత్తాన్ని చెల్లించలేదని గుర్తు చేశారు. వెంటనే ఆటో డ్రైవర్లకు చెల్లించాల్సిన

2లో..

## 12 రాష్ట్రాల్లో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

### - నేటి నుంచి ప్రారంభం, ఈసీ సంచలనం




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశంలో రెండు దశాబ్దాల తర్వాత పెద్ద ఎత్తున వోటర్ లిస్టుల సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్ ప్రారంభానికి ఎన్నికల సంఘం (ఈసీ) ముహూర్తం ప్రకటించింది. దేశవ్యాప్తంగా రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అక్టోబర్ 28 నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు.

2లో..

## మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష

### - యంత్రాంగానికి కీలక ఆదేశాలు

**- కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తుపాను**

**- కృష్ణా జిల్లాకు అతి భారీ వర్ష సూచన - పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక**



అమరావతి (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో ఏర్పడిన సైక్లోన్ మొంథా ప్రభావాన్ని వీలైనంత తక్కువ చేసి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ఉండేందుకు సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజీఎస్) కమాండ్ సెంటర్‌లో . మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ప్రత్యేక అధికారులతో కలిసి తుఫాను పరిస్థితి, సన్నద్ధతలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గంటకు గంట పెరుగుతున్న తుఫాను తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, 'జీరో రిస్క్' చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను రిలీఫ్ క్యాంపులకు మార్చారు. ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, అవసరాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. మొత్తం 2,707 తుపాను ప్రభావిత గ్రామాలను గుర్తించారు. 3,211 జెనరేటర్లను ఆయా ప్రాంతాలకు పంపించారు. మండల్ స్థాయి స్టాక్ పాయింట్లలో బియ్యం, నిత్యావసరాలను రెడీగా ఉంచారు. 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్డీఆర్ఎఫ్ టీమ్స్, ఫైర్ సర్వీసెస్, స్విమ్మర్లు, ఓబీఎం బోట్లు, లైఫ్ జాకెట్లు

2లో..

## తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి

### - కాకినాడ జిల్లా అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష



అమరావతి (ప్రశ్న న్యూస్) మొంథా తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రాణ నష్టాన్ని నివారించడమే ప్రథమ కర్తవ్యంగా భావించి, ముందస్తు రక్షణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం,

3లో..

## హైడ్రా ప్రజావాణికి కబ్జా ఫిర్యాదుల వెల్లువ

### - సాక్ష్యాలతో తరలివస్తున్న జనం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై నగరవాసులు నేరుగా రంగంలోకి దిగుతున్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలకు హైడ్రా ప్రజావాణిలో తక్షణ పరిష్కారం లభిస్తుండటంతో, బాధితులు సాక్ష్యాలతో సహా కార్యాలయానికి క్యూ కడుతున్నారు. సోమవారం ఒక్కరోజే ప్రజావాణికి ఏకంగా 52 ఫిర్యాదులు అందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా పర్యవేక్షిస్తున్న ఈ కార్యక్రమానికి వస్తున్న ప్రజలు, తమ సమస్యలను ఫొటోలు, వీడియోల రూపంలో అధికారుల ముందుంచుతున్నారు. రోడ్లను ఆక్రమిస్తే ఫొటోలు, చెరువులను

3లో..

## బీజేపీకి ఓటు వేయకపోతే ఎంఐఎం బలం పెరుగుతుంది

### - కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్న రాష్ట్ర బీజేపీ చీఫ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమీపిస్తున్న వేళ బీజేపీ ప్రచారంలో దూకుడు పెంచింది. ఈ ఎన్నికలో అసలు పోటీ తమకు, ఎంఐఎం పార్టీకి మధ్యేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బీజేపీకి ఓటు వేయకపోతే, మజ్లిస్ సీట్ల సంఖ్య 8కి పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు అధ్యక్షతన ఉపఎన్నికపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

2లో..

## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా.?

### - వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సోమవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్

3లో..

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అలర్ట్

### - బిల్లుల చెల్లింపుల్లో మార్పులు చేసిన ప్రభుత్వం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పేదల సొంతింటి కల సాకారం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తోంది. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు అందించే బిల్లుల చెల్లింపు విధానంలో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

2లో..

## బాకీ కార్డు ఉద్యమాన్ని

# ముమ్మరం చేసిన బీఆర్ఎస్

రూ. 24 వేలు విడుదల చేయాలని తలసాని డిమాండ్ చేశారు.

### - లక్ష ఆటోలతో ఆందోళన చేస్తామని వార్నింగ్

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని తలసాని అన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం లక్ష ఆటోలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు తలచుకుంటే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తారు, జాగ్రత్త అని ప్రభుత్వ పెద్దలను హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల కుటుంబాల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని తలసాని వ్యాఖ్యానించారు.

### - 161 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు- హరీష్ రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తిగా అధ్వానంగా తయారైందని, 161 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆటో కార్మికులను మోసం చేసి ఓట్లు దండుకున్నాడని, ఏడాదికి రూ. 12,000 ఆటో కార్మికులకు ఇస్తామని మోసం చేశారని విమర్శించారు. ఎర్రగడ్డలో ఆటో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు హరీష్ రావు. అనంతరం ఎర్రగడ్డ నుంచి తెలంగాణ భవన్ కు ఆటోలో బయలుదేరారు.రేవంత్ రెడ్డి రెండేళ్లలో ఆటో కార్మికులకు ఏ ఒక్క హామీ అమలు చెయ్యకపోగా, తమ అనాలోచిత నిర్ణయాలు, మోసపూరిత హామీలతో ఆటో కార్మికులను రోడ్డు పైన పడేశారు. ఆటో కార్మికులకు బాకీ పడ్డ 24 వేల రూపాయలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ వ్యాఖ్యలపై స్పందించిన హరీష్ రావు, మంత్రి వర్గంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసునన్నారు. అడ్లూరీ లక్ష్మణ్ వ్యాఖ్యలపై కొప్పుల ఈశ్వర్ స్పందించారు. కొప్పుల ఈశ్వర్ సవాల్ ను స్వీకరించి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం దగ్గరకు మంత్రి లక్ష్మణ్ రావాలన్నారు.

## 12 రాష్ట్రాల్లో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

ఈ రాష్ట్రాల్లో వోటర్ లిస్టులు అర్ధరాత్రి నుంచి నుంచి ఫ్రీజ్ అవుతాయి. డూప్లికేట్, మరణించిన వోటర్లు, అర్హత లేని వారి పేర్లను తొలగించి, క్లీన్ లిస్టులు తయారు చేసేందుకు ఈసీ ఈ చర్య తీసుకుంటోంది. అండమాన్ %డ% నికోబార్ ఐలాండ్స్, గోవా, పుదుచ్చేరి, చత్తీస్‌ఘడ్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, లక్షద్వీప్ రాష్ట్రాల్లో ఈ సర్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ రాష్ట్రాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు మంగళవారం నుంచి ప్రతి ఇంటికీ మూడుసార్లు వెళ్తారు. ప్రీ-ఫిల్డ్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు పంచుతారు. 2003 వోటర్ లిస్ట్‌లో పేర్లు ఉన్నవారికి అదనపు డాక్యుమెంట్లు అవసరం లేదు. ఆధార్ కార్డు పౌరసత్వానికి గుర్తింపుకాదు.ఈ రాష్ట్రాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) మంగళవారం నుంచి ప్రతి ఇంటికీ మూడుసార్లు వెళ్తారు. ప్రీ-ఫిల్డ్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు పంచుతారు. 2003 వోటర్ లిస్ట్‌లో పేర్లు ఉన్నవారికి అదనపు డాక్యుమెంట్లు అవసరం లేదు. ఆధార్ కార్డు పౌరసత్వానికి గుర్తింపుకాదు. బీహార్ మోడల్ ప్రకారం ఆధార్ ఐడెంటిటీ ప్రూఫ్‌గా మాత్రమే. 2002-04 ఎస్ఐఆర్ లిస్ట్ ఈసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. అన్ని చీఫ్ ఎలక్షనల్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు మంగళవారం పార్టీలతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రాసెస్‌ను వివరిస్తారు. బీహార్‌లో మొదటి దశ ఎస్ఐఆర్ జరిగి, జీరో అప్పీల్స్‌తో పూర్తయిందని సీఈసీ తెలిపారు. ప్రక్రియ అంతా పూర్తి చేసిన తర్వాత వచ్చే ఏడాది ఫిబ్రవరి ఏడో తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

## మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష

అవసరమైన ప్రాంతాలకు పంపించారు. 108/104 అంబులెన్స్ నెట్‌వర్క్, మెడికల్ క్యాంపులు సిద్ధంగా ఉంచారు. ఎమర్జెన్సీ మెడిసిన్స్, బోట్ క్లినిక్స్, ర్యాపిడ్ రెస్పాన్స్ మెడికల్ టీమ్స్ ను మొబిలైజ్ చేశారు. ఆర్టీజీఎస్ వార్ రూమ్ 24%ఇ%7 ఆపరేషనల్ గా ఉంటుంది. శాటిలైట్ ఫోన్లు, వీ-శాట్ లు, డిజిటల్ రేడియోల ద్వారా గంట వారీ బులెటిన్లు మంగళవారం ఉదయం నుంచి ప్రకటిస్తారు. రిజర్వాయర్లు, డ్రైనేజ్ సిస్టమ్స్ మానిటరింగ్ చేస్తారు. తుపాను వల్ల చెట్లు పడిపోతే.. రోడ్లు ధ్వంసం అయితే వెంటనే బాగు చేసేందుకు 851 జేసీబీలు, 757 పవర్ సాస్, డీవాటరింగ్ పంపులు. ఎనర్జీ ర్యాపిడ్ రెస్టోరేషన్ టీమ్స్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్, జనరేటర్లు సిద్ధం చేశారు. ఆర్డబ్ల్యూఎస్ ట్యాంకర్లు, క్లోరిన్ టాబ్లెట్లు, బ్లీచింగ్ పౌడర్, సేఫ్ డ్రింకింగ్ వాటర్ బ్యాకప్ ఉంచేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఐఎండీ ప్రకారం, 'మొంథా' ప్రస్తుతం 560 కి.మీ. దూరంలో విశాఖపట్నం నుంచి, 18 కి.మీ./గం వేగంతో కోస్ట్ వైపు పయనిస్తోంది. 90-100 కి.మీవేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. మచిలీపట్నం-కాకినాడ మధ్య తీరం దాటనుంది. కృష్ణ, గుంటూరు, బాపట్ల, ఎన్‌టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ-అతి భారీ వర్షాలు, గాలులు ఉంటాయి. ఆంధ్ర, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో వర్షాలు పడతాయి.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అలర్ట్

ఇళ్ల నిర్మాణంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90 పనిదినాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పనులను కూడా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దాంతో బిల్లుల చెల్లింపుల్లో ఈ మార్పులు చేయక తప్పలేదని వెల్లడించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి ఒక ప్రకటనలో తెలిపారు.

### - కేంద్రం నిర్ణయాలతో బిల్లుల చెల్లింపుల్లో మార్పులు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బిల్లుల చెల్లింపుల షెడ్యూల్‌లో (దశల్లో) మాత్రమే మార్పులు జరుగుతాయి. కానీ మొత్తం రూ. 5 లక్షల చెల్లింపులో ఎలాంటి మార్పు ఉండదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో భాగంగా మొదటి దశ పూర్తయ్యాక రూ.1 లక్ష, రెండో దశ పూర్తయిన తర్వాత రూ.1 లక్ష చొప్పున లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారు.

ఈ తొలి 2 దశల చెల్లింపుల్లో ఎలాంటి మార్పులు లేవని, మూడో దశలో బిల్లుల చెల్లింపుల్లో మార్పులు చేశారు. గతంలో మూడో దశలో పని పూర్తయితే లబ్ధిదారులకు రూ. 2 లక్షలు చెల్లించేవారు, ఇకపై మూడో దశలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ. 1.60 లక్షలు మాత్రమే ఇవ్వనున్నారు. అందిస్తారు. మిగిలిన మొత్తం రూ. 40 వేలును తర్వాత దశల్లో లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తామన్నారు. ఈ మార్పులు కేవలం పరిపాలన సౌలభ్యం కోసం చేశామని మంత్రి పొంగులేటి వివరించారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి, రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

### - ఇందిరమ్మ ఇళ్ల పథకం

అర్హులైన నిరుపేదల సొంతింటి ర్హులైన సొంతింటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం తీసుకొచ్చింది. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు దశలవారీగా ఆర్థిక సాయం చేయనుంది. ఇందుకోసం తొలి దశ నుంచి అధికారులు తనిఖీ చేస్తారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇండ్లు నిర్మించుకునే వారికి పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు.ం

## బీజేపీకి ఓటు వేయకపోతే

# ఎంఐఎం బలం పెరుగుతుంది

జూబ్లీహిల్స్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు చర్చించారు. ప్రచారంలో నగరంలోని కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ "జూబ్లీహిల్స్‌లో ఎంఐఎంను ఆపాలంటే బీజేపీని గెలిపించాలి. ప్రజల్లో కూడా బీజేపీని గెలిపించాలనే ఆలోచన బలంగా ఉంది" అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

2028లో జరిగే సాధారణ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నాంది పలకాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మరోవైపు, నామినేషన్ల పర్వం ముగియడంతో అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కూడా నియోజకవర్గంలో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కూడా ప్రచారాన్ని ముమ్మరం చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపడతారు.

# బండ్లగూడ భూదోపిడీలో కొత్త కోణం



ఎం.వి రెడ్డి



వి. లచ్చిరెడ్డి



డి. భాస్కర్ రెడ్డి

**హైదరాబాద్ :**

బండ్లగూడ 100 కోట్ల భూ కుంభకోణం కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. 'ప్రజా ప్రశ్న' పత్రికలో బుధవారం ప్రచురితమైన "బండ్లగూడలో 100 కోట్ల భూ కుంభకోణం!" కథనానికి కొనసాగింపుగా, ఈ దందా వెనుక మరో భారీ మోసం బట్టబయలైంది. అక్రమార్కులు కేవలం ప్రభుత్వ భూమిని కాజేయడమే కాకుండా, దాన్నే అడ్డుపెట్టుకుని జాతీయ బ్యాంకులను, అమాయక ప్రజలను ఏకకాలంలో మోసం చేస్తున్నట్లు సామాజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ ఆరోపించారు. సూత్రధారి దేప భాస్కర్ రెడ్డి (డి. భాస్కర్ రెడ్డి), అతనికి సహకరించిన అప్పటి అధికారులు ఉప్పల్ తహసిల్దార్ రమేష్ కుమార్, కీసర ఆర్డీవో లచ్చిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం వి రెడ్డిలు కేవలం ప్రభుత్వ ఖజానాకే కాకుండా, ఇప్పుడు నేరుగా ప్రజల జేబులకు, బ్యాంకుల నిధులకు కన్నం వేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

**బ్యాంకు రుణాలు.. ప్రజా మోసం..**

బాబా గౌడ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణం యొక్క స్వరూపం మరింత భయంకరంగా ఉంది.

**బ్యాంకులకు టోకరా:** స్వాతంత్ర సమరయోధుడు 'రాచకొండ కనకయ్య' పేరుతో సృష్టించిన నకిలీ పత్రాలను, అవినీతి అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలు మరియు ఎన్‌ఓసీలను అడ్డం పెట్టుకుని, డి. భాస్కర్ రెడ్డి బృందం సర్వే నెం. 36/5 లోని ప్రభుత్వ భూమిపై జాతీయ, ప్రైవేట్ బ్యాంకుల నుండి కోట్ల రూపాయల మేర రుణాలు పొందింది. వాస్తవానికి అది ప్రభుత్వ భూమి అని, దానికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కు లేదని తెలిసి కూడా, దొంగ కాగితాలను బ్యాంకుల్లో తనఖా పెట్టి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్ పత్రాలను పరిశీలిస్తే, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, యుకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జమ్మూ అండ్ కాశ్మీర్ బ్యాంక్, బంధన్ బ్యాంక్ వంటి పలు బ్యాంకులు ఈ సర్వే నంబర్‌లోని ఆస్తులపై రుణాలు మంజూరు చేసినట్లు స్పష్టమవుతోంది. కనీస క్షేత్రస్థాయి విచారణ లేకుండానే బ్యాంకు అధికారులు కొందరి స్వప్రయోజనాల కోసం ఈ రుణాలను మంజూరు చేశారని ఆరోపణలున్నాయి.

**అమాయకులకు ఫ్లాట్ల వల:** ఇంతటితో ఆగకుండా, అక్రమంగా కాజేసిన ఇదే సర్వే నెం. 36/5 భూమిలో "పల్లవి డిబిఆర్ గార్డెనియా" పేరుతో జిహెచ్ఎంసి నుండి అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు పొందారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరుగుతున్నా జిహెచ్ఎంసి అధికారులు కళ్లు మూసుకోవడం వెనుక భారీ ముడుపులు చేతులు మారాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ద్విముఖ నష్టం:** ప్రస్తుతం ఈ అక్రమ నిర్మాణంలోని ఫ్లాట్లను అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారు. ఇది ప్రభుత్వ భూమి అని తెలియని ఎంతో మంది సామాన్యులు, తమ కష్టార్జితాన్ని వెచ్చించి, తిరిగి అవే బ్యాంకుల నుండి గృహ రుణాలు పొంది ఈ ఫ్లాట్లను కొనుగోలు చేస్తున్నారు. ఈసీ పత్రాల ప్రకారం, "పల్లవి డిబిఆర్ గార్డెనియా" ప్రాజెక్టులోని అనేక ఫ్లాట్లు (ఉదాహరణకు, ఫ్లాట్ నెం. ఏ505, బి-404, 104, 409, 301, సి-407, ఏ307 మొదలైనవి) దేప భాస్కర్ రెడ్డి, దేప సురేఖ, మెసర్స్ శ్రీకీర్తి కన్స్ట్రక్షన్స్ మరియు మెసర్స్ పల్లవి డెవలపర్స్ వంటి వారు విక్రయించినట్లు తెలుస్తోంది. రేపు ప్రభుత్వం ఈ భూమిని స్వాధీనం చేసుకుంటే, రుణం ఇచ్చిన బ్యాంకులు, ఫ్లాట్లు కొన్న ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఈ మొత్తం వ్యవహారం వల్ల ప్రభుత్వ ఆస్తి అన్యాక్రాంతం కావడమే కాకుండా, బ్యాంకులు భారీ నిరర్థక ఆస్తుల బారిన పడే ప్రమాదం ఉంది మరియు వందలాది కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉంది.

**సిబిఐ విచారణే శరణ్యం**

ఈ కుంభకోణంపై సామాజిక కార్యకర్త బాబా గౌడ్ సిబిఐ విచారణకు డిమాండ్ చేయడం చాలా సమంజసమైనదని, ఇది రాష్ట్ర పోలీసుల పరిధిని దాటిన తీవ్రమైన ఆర్థిక నేరమని ఆయన అభిప్రాయపడ్డారు.

**తీవ్రమైన ఆర్థిక నేరం :** ఈ కుంభకోణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, యుకో బ్యాంక్ వంటి అనేక జాతీయ బ్యాంకులు మోసపోయాయి. జాతీయ బ్యాంకులు కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తాయి మరియు వాటికి సంబంధించిన భారీ ఆర్థిక మోసాలను విచారించే ప్రధాన ఏజెన్సీ సిబిఐ.

**అంతర్రాష్ట్ర కుట్ర :** ఈ తరహా భారీ కుంభకోణాల్లో నిధుల మళ్లింపు దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు లేదా విదేశాలకు కూడా జరిగే అవకాశం ఉంది. ఇలాంటి సంక్లిష్టమైన కేసులను సిబిఐ సమర్థవంతంగా విచారించగలదు.

**అధికారుల ప్రమేయం :** ఈ కుంభకోణంలో తహసిల్దార్, ఆర్డీవో మరియు జిల్లా కలెక్టర్ (ఐఏఎస్ అధికారి) స్థాయి అధికారుల ప్రమేయం ఉంది. ఇంత ఉన్నత స్థాయి అధికారులతో కూడిన కుట్రను స్థానిక ఏజెన్సీల కంటే, కేంద్ర దర్యాప్తు సంస్థ నిష్పక్షపాతంగా విచారించగలదు.

**బ్యాంకు అధికారుల పాత్ర:** దొంగ పత్రాలను, నకిలీ ఎన్‌ఓసీలను చూసి, కనీస క్షేత్రస్థాయి విచారణ కూడా చేయకుండా జాతీయ బ్యాంకులు కోట్లాది రూపాయల రుణాలు మంజూరు చేశాయంటే, అందులో బ్యాంకు అధికారుల పాత్ర కూడా బలంగా ఉంది. సిబిఐ యొక్క 'బ్యాంకింగ్ సెక్యూరిటీ %డ% ఫ్రాడ్ సెల్' విభాగం, ఈ కుట్రలో బిల్డర్లు, ప్రభుత్వ అధికారులు మరియు బ్యాంకు అధికారుల మధ్య ఉన్న సంబంధాలను బయటపెట్టగలదు.

**అవినీతి నిరోధక చట్టం:** ప్రభుత్వ అధికారులు (రెవెన్యూ) మరియు బ్యాంకు అధికారులు (పబ్లిక్ సర్వెంట్లు) లంచం తీసుకుని ఈ మోసానికి సహకరించి ఉంటే, వారిపై సిబిఐ అవినీతి నిరోధక చట్టం కింద కూడా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని బాబా గౌడ్ డిమాండ్ చేశారు.

**ఆర్బిఐ తక్షణమే స్పందించాలి**

ఆర్బిఐ భారత బ్యాంకింగ్ వ్యవస్థకు నియంత్రణ సంస్థ అని, ఈ కుంభకోణం బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా ఎత్తి చూపుతోందని బాబా గౌడ్ అన్నారు. ఆర్బిఐ తక్షణమే ఈ క్రింది చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**తక్షణ అలర్ట్ జారీ చేయడం:** ఆర్బిఐ వెంటనే అన్ని బ్యాంకులకు ఒక సర్క్యులర్ జారీ చేయాలి. బండ్లగూడ సర్వే నెం. 36/5 మరియు "పల్లవి డిబిఆర్ గార్డెనియా" ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి కొత్త ప్రాజెక్ట్ లోన్‌లు లేదా గృహ రుణాలు మంజూరు చేయవద్దని దేశంలోని అన్ని బ్యాంకులను అప్రమత్తం చేయాలి.

**ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశం:** ఈ కుంభకోణంలో రుణాలు ఇచ్చిన అన్ని బ్యాంకుల (ఎస్‌బిఐ, కెనరా, యుసిఓ మొదలైనవి) సంబంధిత బ్రాంచీలలో తక్షణమే ప్రత్యేక ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆర్బిఐ ఆదేశించాలి. అసలు దొంగ పత్రాలను ఎలా అంగీకరించారు? ప్రాపర్టీపై 'లీగల్ ఒపీనియన్' ఎవరు ఇచ్చారు? క్షేత్రస్థాయి విచారణ ఎందుకు చేయలేదు? అనే కోణంలో విచారించి, అధికారుల జవాబుదారీతనాన్ని నిర్ధారించాలి.

**నిబంధనల ఉల్లంఘనపై జరిమానాలు:** ఆర్బిఐ యొక్క 'నో యువర్ కస్టమర్స్ (కెవైసి) మరియు 'డ్యూ డిలిజెన్స్' మార్గదర్శకాలను స్పష్టంగా ఉల్లంఘించినందుకు, నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజాధనాన్ని ప్రమాదంలో పడేసిన బ్యాంకులకు ఆర్బిఐ భారీ జరిమానాలు విధించాలి.

**బ్యాంకు అధికారులపై చర్యలకు ఆదేశం:** ఆడిట్‌లో దోషులుగా తేలిన బ్యాంకు అధికారులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు (సస్పెన్షన్, తొలగింపు) తీసుకోవాలని ఆయా బ్యాంకుల బోర్డులను ఆర్బిఐ ఆదేశించాలి.

**నిరర్థక ఆస్తుల గుర్తింపు:** ఈ రుణాలు ఇప్పుడు తిరిగి చెల్లించే అవకాశం లేదు, ఎందుకంటే తనఖా పెట్టిన ఆస్తి ప్రభుత్వానిది. కాబట్టి, ఈ రుణాలన్నింటినీ వెంటనే నిరర్థక ఆస్తులుగా వర్గీకరించి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని బ్యాంకులను ఆదేశించాలి.

**వినియోగదారుల రక్షణ:** ఇది అత్యంత ముఖ్యం. ఇప్పటికే ఈ ఫ్లాట్లను కొనుగోలు చేసి, గృహ రుణాలు తీసుకున్న అమాయక ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ మోసం కారణంగా వారి సిబిల్ స్కోర్‌లపై ప్రతికూల ప్రభావం పడకుండా చూసేలా బ్యాంకులకు ఆర్బిఐ ప్రత్యేక మార్గదర్శకాలు ఇవ్వాలి.

**'బిఎన్ఎస్' చట్టం కింద చర్యలు తప్పవు!**

"ఇది కేవలం భూకబ్జా కాదు, ఇది ఒక వ్యవస్థీకృత నేరం. ప్రభుత్వ అధికారులే ఇందులో భాగస్వాములు కావడం సిగ్గుచేటు" అని బాబా గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ అక్రమార్కులపై, వారికి సహకరించిన అధికారులపై కొత్తగా వచ్చిన 'భారతీయ న్యాయ సంహిత' చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**నేరపూరిత కుట్ర (బిఎన్ఎస్ సెక్షన్ 61):** ప్రభుత్వ భూమిని కాజేయడానికి, బ్యాంకులను మోసం చేయడానికి డి. భాస్కర్ రెడ్డి మరియు అధికారులు రమేష్ కుమార్, లచ్చిరెడ్డి, ఎం వి రెడ్డిలు సమిష్టిగా కుట్ర పన్నినందుకు ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేయాలి.

**ప్రభుత్వ సేవకులచే నమ్మకద్రోహం (బిఎన్ఎస్ సెక్షన్ 316):** ప్రభుత్వ భూమికి సంరక్షకులుగా ఉండి, దాన్ని కాపాడకుండా, అక్రమార్కులకు అప్పగించి తీవ్ర నమ్మకద్రోహానికి పాల్పడినందుకు తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్లపై ఈ సెక్షన్ వర్తిస్తుంది.

**మోసం (బిఎన్ఎస్ సెక్షన్ 318):** దొంగ పత్రాలతో ప్రభుత్వాన్ని, బ్యాంకులను, ఫ్లాట్లు కొనే అమాయక ప్రజలను మోసం చేసినందుకు భాస్కర్ రెడ్డి మరియు ఇతరులపై ఈ సెక్షన్ కింద అభియోగాలు మోపాలి.

**విలువైన పత్రాల ఫోర్జరీ (బిఎన్ఎస్ సెక్షన్ 335 & 336):** లేని 'రాచకొండ కనకయ్య'ను సృష్టించడం, పహాణీలను తారుమారు చేయడం, ఉనికిలో లేని 'ఫైసల్ పట్టీ' పేరుతో నివేదికలు సృష్టించడం వంటి తీవ్రమైన ఫోర్జరీలకు పాల్పడినందుకు ఈ సెక్షన్ల కింద శిక్షార్హులు.

**ఫోర్జరీ పత్రాన్ని అసలైనదిగా వాడటం (బిఎన్ఎస్ సెక్షన్ 338):** సృష్టించిన దొంగ పత్రాలను అసలైనవిగా నమ్మించి ఎన్ఓసి, బ్యాంకు రుణాలు మరియు జీహెచ్ఎంసి అనుమతులు పొందినందుకు ఈ సెక్షన్ కింద చర్యలు తీసుకోవాలి.

వీటితో పాటు, ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుని సహకరించినందుకు అవినీతి నిరోధక చట్టం కింద కూడా కేసులు నమోదు చేసి, వారి అక్రమ ఆస్తులను తక్షణమే జప్తు చేయాలని బాబా గౌడ్ డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం తక్షణమే స్పందించాలి**

జిల్లా కలెక్టర్ గారు వెంటనే ఈ వ్యవహారంపై స్పందించాలని, వందల కోట్ల ప్రజాధనాన్ని, అమాయక ప్రజల జీవితాలను కాపాడాలని బాబా గౌడ్ కోరారు. తక్షణమే ఈ క్రింది చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బండ్లగూడ సర్వే నెం. 36/5 లోని భూమిలో ఎలాంటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరగకుండా తక్షణమే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేయాలి.

"పల్లవి డిబిఆర్ గార్డెనియా" పేరుతో జారీ చేసిన అక్రమ నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్‌ను ఆదేశించాలి.

ఈ మొత్తం కుంభకోణంపై సిబిఐ విచారణకు ఆదేశించి, సూత్రధారి డి. భాస్కర్ రెడ్డితో పాటు, అప్పటి అధికారులు రమేష్ కుమార్, లచ్చి రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ఎం వి రెడ్డిల పెన్షన్ నిలిపివేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

ఈ కుంభకోణం, ప్రభుత్వం, బ్యాంకులు మరియు ప్రజలకు "ద్విముఖ వంచన" అని, దీనిపై సిబిఐ మరియు ఆర్బిఐ వంటి ఉన్నత స్థాయి సంస్థలు తక్షణం స్పందిస్తేనే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం నిలబడుతుంది అమాయక బాధితులకు కొంతైనా న్యాయం జరిగే అవకాశం ఉంటుందని బాబా గౌడ్ హెచ్చరించారు.




# జూబ్లీహిల్స్‌లో హోరాహోరీ ప్రచారం

పేర్కొన్నారు.కాగా ఈ ఉదయం మంత్రి సీతక్క నగరంలోని కృష్ణ కాంత్ పార్కులో మార్నింగ్ వాకర్స్ ను కలిసి ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేశారు. స్థానిక వీధి వ్యాపారులతో ముచ్చటించారు.

### - జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు బీజేపీ సమావేశం

ఇలా ఉండగా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల శక్తి కేంద్ర ఇంచార్జిల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు , వేముల అశోక్,. చంద్రశేఖర్ జి ఇంకా పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### - జూబ్లీహిల్స్ గెలుపు 2028 లో బీజేపీ ప్రభుత్వానికి నాంది

జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు జూబ్లీహిల్స్ గెలుపు 2028 లో బిజెపి ప్రభుత్వానికి నాంది అవుతుందని అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు బిజెపికి ఓటు వేయకపోతే , మజ్లిస్ కు 8 సీట్లు అవుతాయన్నారు.

### - ఎంఐఎం ను ఆపాలి అంటే బిజెపిని గెలిపించాలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

హైదరాబాద్లో ఎంఐఎం ను ఆపాలి అంటే బిజెపిని గెలిపించాలని,




ఆ ఆలోచన ప్రజలకు కూడా వచ్చిందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ లో బిజెపికి విజయ అవకాశాలు పెరుగుతున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ టు బి ఆర్ ఎస్ కానీ, కాంగ్రెస్ కానీ చేసింది ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు

### - ఆటోలో ప్రయాణించి ఎన్నికల ప్రచారం చేసిన కేటీఆర్

మరోవైపు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, సీనియర్ నాయకుడు హరీష్ రావు, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తదితరులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారాన్ని సాగిస్తున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ జూబ్లీహిల్స్ చెక్పోస్ట్ నుంచి ఆ పార్టీ కార్యాలయం వరకు ఆటోలో ప్రయాణించి పార్టీ అభ్యర్థి కోసం ఎన్నికల ప్రచారం చేశారు.

### - టఫ్ ఫైట్ లో ఎవరికి ప్రజలు పట్టం కడతారో

కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అడుగడుగున వైఫల్యాల పాలన అని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమేనని కేటీఆర్ ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి అన్ని పార్టీలు తమదైన పంథాలో త్వరలో దూకుడు చూపిస్తున్న క్రమంలో టఫ్ ఫైట్ లో ఎవరికి ప్రజలు పట్టం కడతారు అన్నది తెలియాల్సి ఉంది.

## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా.?

సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది.పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్డబ్ల్యూఏ), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని ఆర్డబ్ల్యూఏలన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

## హైడ్రా ప్రజావాణికి కబ్జా ఫిర్యాదుల వెల్లువ

కబ్జా చేస్తుంటే వీడియోలతో సహా వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. కొందరు బాహాటంగా తమ వివరాలు వెల్లడిస్తుంటే, మరికొందరు తమ పేర్లను గోప్యంగా ఉంచాలని కోరుతున్నారు. గంటల్లో, రోజుల్లోనే తమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్న నమ్మకంతోనే వస్తున్నామని పలువురు చెబుతున్నారు.

### - ప్రభుత్వ భూములు, చెరువులే లక్ష్యం

ప్రజావాణికి అందిన ఫిర్యాదుల్లో ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, బాలానగర్ మండలం హస్మత్‌పేట్‌లోని సర్వే నంబర్ 1లో ఉన్న 28.28 ఎకరాల చారిత్రక ప్రభుత్వ భూమిని స్థానిక రాజకీయ నాయకులు, వారి అనుచరులు ఆక్రమించి ప్లాట్లుగా అమ్ముతున్నారని ఓల్డ్ బోయిన్‌పల్లి వాసులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా, శంషాబాద్ పరిధిలోని నరసింహ కుంట తూములు మూసేయడంతో పంట పొలాలు, ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్లు మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని 22 ఎకరాల శాంబుని కుంట ఆక్రమణలతో ఆరేడు ఎకరాలకు పరిమితమైందని, కూకట్‌పల్లిలోని పరికి చెరువులో 12 ఎకరాలను రాత్రికి రాత్రే మట్టితో పూడ్చేస్తున్నారని స్థానికులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. సాగర్ రోడ్డులో కాలనీ రోడ్లను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చారని, అమీన్‌పూర్ పెద్ద చెరువు కబ్జాను అడ్డుకున్న వారిపై దాడులు చేస్తూ పోలీసులతో తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని పలువురు వాపోయారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పరిశీలించారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత అధికారులకు వాటిని అప్పగించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

## తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి

సహాయక చర్యలపై కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లాలోని 12 మండలాలపై అధికంగా ఉంటుందని సమాచారం. రేపు కాకినాడ పరిసర ప్రాంతాల్లో తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. యంత్రాంగం 24 గంటలూ అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. తీర ప్రాంత ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే జిల్లాలో 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలు సిద్ధంగా ఉంచాలి" అని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ సూచించారు. "పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న గర్భిణులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను పునరావాస కేంద్రాలకు చేర్చినట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు నిరంతరం అందేలా చూడాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి. తుపానుపై భయాందోళనలు సృష్టించకుండా, గ్రామాల్లో మైకుల ద్వారా సహాయక చర్యలను వివరిస్తూ ప్రజలకు ధైర్యం చెప్పాలి" అని ఆయన అన్నారు.

### - అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

తుపాను సహాయక చర్యల్లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లిన ప్రజల ఇళ్లకు దొంగల బెడద లేకుండా పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించాలని, అవసరమైతే సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున, ఆయకట్టు ప్రజలను జలవనరుల శాఖ అధికారులు ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టలు, కాలువ గట్లను గుర్తించి ఇసుక బస్తాలతో పటిష్ఠం చేయాలని సూచించారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలని, వారి బోట్లకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. తుపాను కారణంగా నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం కలగకుండా మార్కెటింగ్ శాఖ చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉన్నందున, మరమ్మతుల కోసం సిబ్బందిని సిద్ధం చేయాలని, అత్యవసర సమాచారం కోసం శాటిలైట్ ఫోన్లను వినియోగించాలని సూచించారు.

### - కాకినాడకు కోటి రూపాయల అత్యవసర నిధి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్లు విడుదల చేయగా, అందులో కాకినాడ జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నిధులను పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, బాధితులకు నిత్యావసరాల పంపిణీ, దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సాయం అందించడం వంటి కార్యక్రమాలకు వినియోగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## అమెరికా అధ్యక్ష పదవిపై
## కమలా హారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు



అమెరికా అధ్యక్ష పదవిపై మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం లేకపోలేదని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా అధ్యక్షురాలిగా ఒక మహిళ వైట్‌హౌస్‌లో ఉండడం ఖాయమని, "బహుశా అది నేనే కావచ్చు" అని వ్యాఖ్యానించారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమలా హారిస్ మాట్లాడుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ట్రంప్ ఫాసిస్ట్ ధోరణితో వ్యవహరిస్తారని హెచ్చరించానని, ఇప్పుడు అది నిరూపితమైందని ఆమె అన్నారు. "నా మనవరాళ్లు వారి జీవితంలో ఖచ్చితంగా ఓ మహిళా అధ్యక్షురాలిని చూస్తారు" అని ఆమె పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేసే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, కానీ రాజకీయాల్లో భవిష్యత్తు ఉందని ఇప్పటికీ నమ్ముతున్నానని హారిస్ పేర్కొన్నారు. తాను చేయాల్సిన పని ఇంకా పూర్తి కాలేదన్నారు. తన కెరీర్ మొత్తాన్ని సేవలో గడిపానని, అది తన రక్తంలోనే ఉందని ఆమె అన్నారు. అలాగే, తదుపరి ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీ చేసే అవకాశాలపై స్పందిస్తూ, "పోల్స్ గురించి పట్టించుకోవడం లేదు. వాటిని నమ్మి ఉంటే, నేను ఇంతవరకు రాజకీయాల్లో ఉండేదాన్ని కాదు" అని ఆమె అన్నారు.

## 100 షేర్లు కొంటే 800 షేర్లొస్తాయ్..
## లక్ష పెడితే రూ.8 లక్షలు




స్మాల్ క్యాప్ కేటగిరిలోని కెమికల్ సెక్టార్ కంపెనీ ఫినోటెక్స్ కెమికల్ లిమిటెడ్ తమ షేర్ హోల్డర్స్ బంపర్ ఆఫర్ తెచ్చింది. డబుల్ ట్రీట్ అని చెప్పాలి. కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ గత నెలలో సమావేశమై స్టాక్ స్ప్లిట్ తో పాటు బోనస్ షేర్లు జారీ చేసేందుకు ప్రతిపాదించారు. తాజాగా అక్టోబర్ 25వ తేదీన కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో అందుకు ఆమోదం లభించింది. దీని ప్రకారం కంపెనీకి చెందిన 100 షేర్లు కొనుగోలు చేసిన వారికి ఏకంగా 800 షేర్లు ఖాతాలోకి వస్తాయి. మరోవైపు ఈ కంపెనీ షేరు ఐదేళ్ల కాలంలో 750 శాతం వరకు లాభాన్ని తమ వాటాదారులకి ఇచ్చింది. అక్టోబర్ 25వ తేదీ కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. 1:2 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపట్టేందుకు కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చేసిన ప్రతిపాదనకు షేర్ హోల్డర్ల నుంచి ఆమోదం లభించింది. అంటే రూ. 2 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరును రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండేలా 2 ఈక్విటీ షేర్లుగా విభజిస్తారు. ఈ స్టాక్ స్ప్లిట్ అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించే రికార్డు డేట్ త్వరలో వెల్లడిస్తామని కంపెనీ తెలిపింది.అలాగే 4:1 రేషియోలో బోనస్ షేర్లు ఇచ్చేందుకు కంపెనీ బోర్డు డైరెక్టర్స్ ప్రతిపాదనకు షేర్ హోల్డర్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీని అర్థం రికార్డు డేట్ నాటికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరుని తమ డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉన్నవారికి అదనంగా రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండే 4 ఈక్విటీ షేర్లను బోనస్ రూపంలో ఉచితంగా ఇస్తారు. అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించే రికార్డు తేదీని త్వరలోనే ప్రకటిస్తామని కంపెనీ తెలిపింది. శుక్రవారంతో ముగిసిన స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో ఫినోటెక్స్ కెమికల్ షేరు ధర 3.3 శాతం లాభంతో రూ. 255.99 వద్ద ముగిసింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 387.10, కనిష్ఠ ధర రూ. 207 వద్ద ఉన్నాయి. గత వారంలో ఈ షేరు 6 శాతం లాభపడింది. గత నెల రోజుల్లో 2 శాతం లాభాన్ని ఇచ్చింది. గత ఆరు నెలల్లో 5 శాతం పెరిగింది. గత ఏడాదిలో 30 శాతం నష్టపోయింది. గత ఐదు సంవత్సరాల్లో ఈ షేర్ 748 శాతం లాభాన్ని ఇచ్చింది. అంటే లక్ష రూపాయలు పెట్టిన వారికి రూ.8.50 లక్షల వరకు అందించి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 2930 కోట్లుగా ఉంది.

## అక్టోబర్‌లో రికార్డు స్థాయికి
## చేరిన టూవీలర్ రిజిస్ట్రేషన్లు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0, పండగ సీజన్ డిమాండ్ కలిసి రావడంతో ద్విచక్ర వాహన మార్కెట్ కొత్త ఉత్సాహంతో దూసుకెళుతోంది. అక్టోబరు నెలలో ఏకంగా 18.5 లక్షల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి.ఈ ఏడాదిలో ఒక నెలలో నమోదైన అత్యధిక రిజిస్ట్రేషన్లు ఇవే కావడం విశేషం. వాహన్ పోర్టల్ డేటా ప్రకారం ఈ విషయం వెల్లడైంది.ఇటీవల జీఎస్టీ 2.0 విధానంలో భాగంగా 350సీసీ ఇంజిన్ సామర్థ్యం వరకు ఉన్న మోటార్‌సైకిళ్లపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి ప్రభుత్వం తగ్గించింది. దీంతో వాహనాల ధరలు గణనీయంగా తగ్గి, కొనుగోలుదారుల్లో ఆసక్తి పెరిగింది. దీనికి తోడు దీపావళి పండగ సీజన్ కావడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు ఊపందుకున్నాయి.సెప్టెంబరు నెల నుంచే టూవీలర్ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబరులో కంపెనీల నుంచి డీలర్లకు సరఫరా అయ్యే వాహనాల సంఖ్య 9 శాతం పెరిగి, 2 మిలియన్ల మార్కును దాటింది. దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ సెప్టెంబర్‌లో 5 శాతం వృద్ధితో 6,47,582 యూనిట్లను విక్రయించింది. అదే నెలలో కంపెనీ రిజిస్ట్రేషన్లు 19 శాతం పెరిగి 3,23,230 యూనిట్లకు చేరాయి.ఇక ఇతర ప్రధాన కంపెనీల విషయానికొస్తే, హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియ అమ్మకాలు 3 శాతం పెరిగి 5,05,000 యూనిట్లుగా నమోదు కాగా, టీవీఎస్ మోటార్ అమ్మకాలు 12 శాతం వృద్ధితో 4,13,000 యూనిట్లకు చేరాయి. బజాజ్ ఆటో 5 శాతం వృద్ధితో 2,73,000 యూనిట్లు, ఐషర్ మోటార్స్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు ఏకంగా 43 శాతం వృద్ధితో 1,13,000 యూనిట్లుగా నమోదయ్యాయి.సెప్టెంబర్ ఆరంభంలో శ్రాద్ధ పక్షం కారణంగా అమ్మకాలు కాస్త నెమ్మదించినా, పండగ సీజన్ మొదలవగానే ఒక్కసారిగా పుంజుకున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. "జీఎస్టీ తగ్గింపు, కొత్త మోడళ్ల విడుదల, పండగ ఆఫర్లు కలిసి వినియోగదారుల్లో కొనుగోలు సెంటిమెంట్‌ను బలంగా పెంచాయి" అని ఓ విశ్లేషకుడు పేర్కొన్నారు.యాక్సిస్ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం, గత నెలలో మొత్తం ఆటోమొబైల్ రంగంలో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. టూవీలర్లు, త్రీవీలర్లు, వాణిజ్య వాహనాల అమ్మకాలు బలంగా పెరిగినప్పటికీ, ప్యాసింజర్ కార్ల విక్రయాలు మాత్రం గతేడాదితో పోలిస్తే తగ్గుముఖం పట్టాయి.

## పసిడి పరుగులకు బ్రేక్..



కొండెక్కిన బంగారం ధరలు ప్రస్తుతం కొండదిగుతున్నాయి. గతవారంలో ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పుత్తడి తిరోగమనబాట పట్టింది. నేడు కూడా బంగారం ధరలు భారీగా తగ్గాయి. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో తులంపై రూ.1,440 తగ్గింది. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,24,480కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,050 తగ్గి రూ.1,14,100కి చేరింది.అటు వెండి ధరలు కూడా బంగారంతో సమానంగా దిగొచ్చాయి. పది రోజుల కిందట కిలో వెండి ధర రూ.2 లక్షలకు చేరువైన విషయం తెలిసిందే. ఇప్పుడు కిలో వెండి రూ.1.50 లక్షల మధ్య ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడం, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ బలపడుతుండటంతో దేశీయంగా ధరలు దిగొస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా, పది రోజుల క్రితం తులం బంగారం ఎన్నడూ లేని విధంగా రూ.1.35 లక్షలు దాటిన విషయం తెలిసిందే. దీంతో వినియోగదారులు పుత్తడి కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు బంగారం ధరలు తగ్గుతుండటంతో కొనుగోలుదారుల్లో ఉత్సాహం నెలకొంది. అటు రేట్లు తగ్గడంపై పెట్టుబడిదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

## ప్రయివేటు రంగ
## కార్యకలాపాలు క్షీణత



దేశంలో ప్రయివేటు రంగ కార్యకలాపాల్లో స్తబ్దత చోటు చేసుకుంటుంది. డిమాండ్ బలహీనంగా ఉండటం, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వ్యాపార ఆశావాదంపై ప్రతికూల ప్రభావం చూపాయని హెచ్ఎస్‌బిసి తన ఫ్లాష్ ఇండియా కంపోజిట్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ)లో తెలిపింది. ఈ పరిణామాలతో అక్టోబర్‌లో పిఎంఐ 59.9 కి పడిపోయిందని%ా% ఇది ఐదు నెలల కనిష్ట స్థాయి అని వెల్లడించింది. ఇది రాయిటర్స్ పోల్ అంచనా 61.2 కంటే తక్కువ. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 61.0గా నమోదయ్యింది. మే నెల నుండి అత్యల్ప స్థాయి అయినప్పటికీ 50 మార్కు పైన ఉండటం వల్ల కొంత ఆశావాదం నెలకొంది. సేవల రంగంలో మందగించిన వృద్ధి ఈ క్షీణతకు ప్రధాన కారణం. అయితే తయారీ రంగం సెప్టెంబర్‌లో నాలుగు నెలల కనిష్ఠ స్థాయి నుండి కొంత కోలుకొంది. తయారీ పిఎంఐ 57.7 నుండి 58.4కి పెరగగా, సేవల వ్యాపార కార్యకలాపాల ఇండెక్స్ 60.9 నుండి 58.8కి పడిపోయింది. ఈ ఏడాది మే నెల నుండి కొత్త ఆర్డర్‌లు నెమ్మదించాయి. ట్రంప్ టారిఫ్‌ల అనంతరం సేవల రంగంలో ఉత్సాహం కోల్పోవడం దీనికి ప్రధాన కారణం. అయితే.. వస్తువుల ఉత్పత్తి సెప్టెంబర్ కంటే కొంచెం వేగంగా పెరుగుదలను నమోదు చేసింది. ప్రధానంగా తయారీ ఎగుమతులలో మందగింపునతో అంతర్జాతీయ డిమాండ్ ఏడు నెలల్లో అత్యంత బలహీనంగా నమోదయ్యింది. భారత ఎగుమతులపై అమెరికా అధిక సుంకాలను అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. రష్యన్ చమురు కొనుగోళ్లను ఇండియా ఆపకపోతే సుంకాలు మరింత ఎక్కువగానే ఉంటాయని అధ్యక్షుడు ట్రంప్ పదేపదే హెచ్చరిస్తోన్న విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమాచారం ప్రకారం.. సెప్టెంబర్‌లో యుఎస్‌కు ఎగుమతులు భారీగా తగ్గాయి. సెప్టెంబర్‌లో అమెరికాకు ఎగుమతులు 20.3 శాతం క్షీణించి 5.5 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇది వరుసగా ఐదో నెల పతనం కావడం గమనార్హం. మరోవైపు సెప్టెంబర్‌లో జిఎస్‌టి తగ్గించడం వల్ల ఖర్చు ఒత్తిడి తగ్గినప్పటికీ, కంపెనీలు ఈ ప్రయోజనాలను ఖాతాదారులకు బదిలీ చేయకుండా, అధిక కార్యకలాపాల ఖర్చులను భర్తీ చేయడానికి విక్రయ ధరలను పెంచాయి. వచ్చే ఏడాది వ్యాపారాలు ఒత్తిడిలో ఉండొచ్చనే అంచనాల్లో జిఎస్‌టి తగ్గింపు ప్రతి ఫలాలను వినియోగదారులకు బదిలీ చేయలేదని విశ్లేషించింది.

## వొడాఫోన్ ఐడియాకు సుప్రీంలో భారీ ఊరట



సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిల లెక్కింపు వ్యవహారంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2016-17 వరకు బకాయిల కోసం టెలికాం విభాగం (డాట్) ఇచ్చిన అదనపు పన్ను డిమాండ్‌లపై కంపెనీ చేస్తోన్న అభ్యంతరాలను పరిశీలించేందుకు కేంద్రానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. డాట్ తాజా పన్ను డిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ వొడాఫోన్ ఐడియా వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2016-17 కాలానికి అదనపు ఏజీఆర్ చెల్లించాల్సిందిగా డాట్ ఇటీవల కంపెనీకి నోటీసులు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ.. రూ.5,606 కోట్ల అదనపు పన్నును డిమాండ్ చేసింది. అంతేగాక, 2018-19 వరకు ఐడియా సెల్యులార్ గ్రూప్, వొడాఫోన్ ఐడియా కోసం లైసెన్సు ఫీజు బకాయిల మొత్తాన్ని కూడా సవరించింది. దీంతో కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏజీఆర్ బకాయిలపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు పరిధిని దాటి డాట్ పన్ను డిమాండ్ చేస్తోందని కంపెనీ వాదించింది. తాజా పన్ను డిమాండ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించింది.ఈ విచారణ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. "వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49శాతం వాటా ఉంది. దాదాపు 20 కోట్ల మంది వినియోగదారులు ఈ సేవలపై ఆధారపడ్డారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు.. కంపెనీ లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించేందుకు కేంద్రం సుముఖంగా ఉంది" అని కోర్టుకు తెలిపారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. "ఇది విధానపరమైన అంశం. ఇందులో కేంద్రాన్ని అడ్డుకునేందుకు ఎలాంటి కారణం కన్పించట్లేదు. అందువల్ల కంపెనీ వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టేస్తున్నాం" అని వెల్లడించింది. వొడాఫోన్ ఐడియా లేవనెత్తిన అంశాలను పరిశీలించేందుకు కేంద్రానికి అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామాలతో నేడు స్టాక్ మార్కెట్లలో వొడాఫోన్ ఐడియా షేర్లు రాణించాయి.

## అదానీ కంపెనీల్లోకి అమెరికా
## బీమా సంస్థల భారీ పెట్టుబడులు

భారత ప్రభుత్వ ప్రోద్బలం వల్లే అదానీ గ్రూప్ కంపెనీల్లో, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) భారీ పెట్టుబడులు పెట్టిందంటూ వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించిన కథనం తీవ్ర దుమారం రేపింది. అయితే గౌతమ్ అదానీకి చెందిన కంపెనీల్లోకి ఇటీవల వచ్చిన భారీ పెట్టుబడులను పరిశీలిస్తే.. ఎల్ఐసీ నుంచి కాకుండా, అమెరికా, అంతర్జాతీయ బీమా సంస్థల నుంచే ఉన్నాయని తేలుతోంది. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో ఎల్ఐసీ 570 మిలియన్ డాలర్లు (రూ.5,000 కోట్లు) పెట్టుబడులు పెట్టిన నెల తర్వాత.. ఈ ఏడాది జూన్‌లో అదానీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో అమెరికా సంస్థ ఏథెన్ ఇన్సూరెన్స్ రూ.6,650 కోట్లు (750 మి.డాలర్లు) పెట్టుబడులు పెట్టింది. అనంతరం పలు అంతర్జాతీయ దిగ్గజ బీమా సంస్థలు ఇదే బాటలో నడిచాయి. ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (ఎంఐఏఎల్)లో 750 మి.డాలర్ల పెట్టుబడిని తమ నిర్వహణలోని ఫండ్స్, అనుబంధ సంస్థలు, ఇతర దీర్ఘకాలిక పెట్టుబడిదారులు పూర్తి చేసినట్లు ఈ ఏడాది జూన్ 23న ఏథెన్ మాతృ సంస్థ అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. ఎంఐఏఎల్‌కి అపోలో ఇచ్చిన రెండో అతిపెద్ద రుణం ఇది.డీబీఎస్ బ్యాంక్, డీజడ్ బ్యాంక్, రాబో బ్యాంక్, బ్యాంక్ సినోపాక్ కో లిమిటెడ్ సహా అంతర్జాతీయ రుణదాతల బృందం నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ 250 మిలియన్ డాలర్లు సమీకరించింది. ఈ ఏడాది ప్రథమార్ధంలో అదానీ పోర్ట్స్, పునరుత్పాదక ఇంధన విభాగం అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ సంస్థలు 10 బిలియన్ డాలర్లకు పైగా రుణాలు పొందేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ ఆగస్టు నివేదికలో వెల్లడించింది. అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడుల వెనుక భారత ప్రభుత్వ ఉన్నతాధికారుల పాత్ర ఉందంటూ 'వాషింగ్టన్ పోస్ట్'లో కథనం రావడంతో వివాదం నెలకొంది. ఈ వార్తలను ఎల్ఐసీ ఖండించింది. తమ బోర్డు ఆమోదించిన విధానాలకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టామని ఎల్ఐసీ స్పష్టం చేసింది.

# అయ్యప్ప మాలదారణం.. సకలపాపహారణం

- స్వామియే శరణమయ్యప్ప అనే శరణుఘోష వినిపించే రోజులు
- కఠోర దీక్షలో నియమావళిని ఆచరిస్తూ స్వామి సేవలో తరించే ఘడియలివి
- కార్తీక మాసంలో భక్తులు ధరించే మాల అయ్యప్ప స్వామి మాల
- హరిహరాదులకు అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక మాసం
- శరీరాన్ని, మనస్సును చెడు నుంచి మంచి మార్గం వైపు మళ్లించే అయ్యప్ప స్వామి దీక్ష
- 41 రోజుల తర్వాత శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధికి మాలదారులు

"స్వామియే..శరణమయ్యప్ప అనే శరణుఘోష వినిపించే రోజులు వచ్చేశాయి. అయ్యప్ప నామంతో భక్తకోటి పులకించే సమయమిది. కఠోర దీక్షలో నియమావళిని ఆచరిస్తూ స్వామి సేవలో తరించే ఘడియలివి. అయ్యప్ప దీక్షలు చేపట్టేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మేడ్చల్ పట్టణంతో పాటు మండలంలో అనేక మంది అయ్యప్ప మాల ధరించి స్వామి పూజలో మునిగి తేలుతున్నారు. కార్తీక మాసం వచ్చిదంటే చాలు హిందూ సంప్రదాయంలో ఎక్కువగా అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో అయ్యప్ప మాలధారణ మొదలుకొని, దీక్షా విధానం, దీక్ష పూర్తయి తిరిగి వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర నియమాలన్నింటిపై "ప్రజాప్రశ్న " అందిస్తున్న ప్రత్యేక కథనం.



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** హరిహరాదులకు అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక మాసం. ఈ మాసమంతా ఆలయాలు నిత్య పూజలతో, భక్తులతో, దీక్ష తీసుకున్న అయ్యప్ప స్వాములతో సందడిగా కన్పిస్తాయి. ఊరురా... వాడ వాడలా అయ్యప్ప శరణుఘోష వినిపిస్తుంది. "స్వామియే శరణమయ్యప్ప" అంటూ భక్తకోటి శబరిమల వైపు అడుగులు వేసేందుకు దీక్ష పూనుకున్నారు. శరీరాన్ని, మనస్సును చెడు నుంచి మంచి మార్గం వైపు మళ్లించేవే ఈ దీక్ష. దాంట్లో భాగంగా ఈ మాసంలో స్వామియే శరణం అంటూ అయ్యప్ప మండల దీక్ష మార్గాన్ని అన్వేషించేవారు, సన్మార్గంలో జీవన యాత్ర సాగించాలనుకునే వారు విధిగా జీవితకాలంలో ఒక్కసారైనా శబరిమలై యాత్ర చేసి అయ్యప్పను దర్శించుకోవాలని ఆకాంక్షిస్తుంటారు.

## అయ్యప్పను సేవించే విధానం..

అయ్యప్ప స్వామిని నవవిధ సేవలతో పూజిస్తుంటారు. నవ విధాలు అంటే శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, నమస్కారం, ధ్యానం, సుకృతం, ఆత్మ నివేదన. స్వామిదీక్షలో ఇరుముడికి మహా విశిష్టత ఉంటుంది. ఇరుముడిలో రెండు ముడులుంటాయి. ఒక ముడిలో అయ్యప్ప స్వామి స్వరూప ముద్ర, కొబ్బరికాయ, స్వామివారికి సమర్పించే వస్తువులు ఉంటాయి. కొబ్బరికాయలను స్వచ్ఛమైన ఆవు నెయ్యితో నింపుతారు. ఈ నెయ్యి జ్ఞానానికి ప్రతీక. కొబ్బరికాయలను బిగించడం వైరాగ్యానికి చిహ్నంగా భావించి మూతపెడతారు. కాయను ఆత్మ అనే లక్కతో సీజ్ చేస్తారు. మనస్సులోని జ్ఞానాన్ని సంపూర్ణంగా అయ్యప్పకు నిండు మనస్సుతో అర్పించుకున్నట్లు భావిస్తారు. దీనినే ఆత్మనివేదన అంటారు. అయప్పస్వామి దీక్షలో పరమార్థం కూడా ఇదే. రెండో ముడి వెనుక భాగంలో ఉంటుంది. ఇందులో బియ్యం, బెల్లం, అటుకులు, కూరగాయలు, పూజా సామగ్రి ఉంచుతారు. బియ్యం, కూరగాయలు పెద్ద పాదంలో పర్యటిస్తున్న సమయంలో వంట కోసం, పూజా సామగ్రి పర్యటన సమయంలో పూజ కోసం స్వాములు ఉపయోగించాల్సి ఉంటుంది.

## ఏటేటా కన్నె స్వాములు...

శబరి కొండల్లో ఉండే మాలికాపురోత్తమ దేవి అయ్యప్ప స్వామిని ప్రేమిస్తుంది. పెళ్లి చేసుకోమ్మని కోరుతుంది. ఇది విన్న స్వామి వారు చిరునవ్వుతో తిరస్కరిస్తాడు. అయినా ఆమె పట్టు వీడదు. దీంతో కన్నెస్వాములు తన మాల ధరించి రానప్పుడు వివాహమాడుతానని స్వామి ఆమెకు మాటిస్తాడు. అయితే అది ఎప్పటికీ జరగనిదని పరమార్థం. ఇందులో భాగంగానే కన్నె స్వాముల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తోంది. దీక్ష మొదటిసారి చేపట్టేవారు కన్నెస్వాములు, తరువాత వరుసగా కత్తి స్వామి, గంటస్వామి, గధాస్వామి, గురుస్వాములుగా పిలుస్తారు. తొమ్మిది నుంచి 18సార్లు శబరిమలై యాత్రకు వెళ్లివచ్చిన వారు కన్నెస్వాముల దీక్ష చేపట్టేందుకు సహకరిస్తారు.

## పడిపూజ ఎందుకు.?

అయ్యప్ప సన్నిధానంలో 18 మెట్లు ఉంటాయి. ఇవి కామ, క్రోధ.. మొద లైన అరిషడ్వర్గాలని ప్రతీతి. మనిషిలోని 18 రకాల చెడు గుణాలు తొలగిపోవటానికి దీక్షలో పడిపూజ నిర్వహిస్తారు. అయ్యప్పను దర్శించిన ప్రతిసారి చెడు లక్షణాల్ని విడిచిపెట్టి మంచివాడిగా మారాలని కోరుకుంటూ ఈ పూజ నిర్వహిస్తారని గురుస్వాములు చెబుతారు.

## ఇరుముడి అత్యంత ప్రాధాన్యం..

దీక్షలో 41 రోజుల తర్వాత వేసే ఇరుముడికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఇరు అంటే రెండు అని అర్థం. అనగా రెండు ముడులు అని. ముందు (మో)ముడిలో పీటం, భస్మం, గంధం, కొబ్బరి కాయలు, నెయ్యి, పూజా సామగ్రి ఉంటాయి. వెనుక ముడి (రెండో) ప్రయాణానికి కావాల్సిన వస్తువులు ఉంటాయి. వీటినే పుణ్యపు మూట, పాపపు మూటగా పిలుస్తారు.

## తల స్నానం..

అభ్యంగన స్నానం దేవునికి ప్రీతిపాత్రం. అయ్యప్ప మాల ధరించిన ప్రతి ఒక్కరూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తప్పక చల్లటి నీళ్లతో తలంటు స్నానం చేయాల్సిందే. దీంతో మనసుకు హాయినిస్తుంది. చెడు భావనలను దూరం చేసి దైవత్వం వైపు ఏకాగ్రత కుదురుతుందనేది భావన.

## నల్లని వస్త్రాలే ఎందుకంటే..

దీక్షలో ఉన్న భక్తులు నల్లని వస్త్రాలు ధరించడంపై ఓ పురాణ కథ ప్రచారంలో ఉంది. ఒకానొక సందర్భంలో అయ్యప్ప స్వామి శనీశ్వరున్ని వరం కోరుతాడు. తన భక్తుల వద్దకు శని రాకుండా, ఎలాంటి కష్టాలు రాకుండా చూడాలని కోరడంతో అప్పుడు శనీశ్వరుడు తనకు ఇష్టమైన నల్లని వస్త్రాలు ధరించిన భక్తుల వద్దకు తాను (శని) వెళ్లనని చెప్తాడు. అందుకే భక్తులు శనీశ్వరునికి ఇష్టమైన నల్లరంగు వస్త్రాలు ధరిస్తారని గురుస్వాములు చెప్తారు. అయితే నల్లని వస్త్రాలు ధరించటం వల్ల లాభాలు కూడా కొన్ని ఉన్నాయని శాస్త్ర జ్ఞానం చెప్తోంది. దీక్ష చలికాలంలో వస్తుంది. నల్లని రంగు వేడిని స్వీకరిస్తుంది. శరీరానికి వెచ్చదనం ఇస్తుంది. దుమ్మూధూళి సైతం నిలువదు. శబరిమల కొండలపై స్వామిని దర్శించుకునేందుకు అడవిలో కాలినడకన వెళ్లాలి. అందువల్ల రాత్రుల్లో జంతువుల నుంచి రక్షణ కూడా ఈ వస్త్రాలు సహకరిస్తాయి.

## అలంకరణ..

అయ్యప్పకు నిండుగా అంకరణ చేసుకున్న స్వాములంటే ఇష్టం. ముఖ్యంగా మణికంఠులు ఒళ్లంతా చందనం బొట్లు పెట్టుకుని అలంకరించుకుంటే అయ్యప్ప స్వామికి మహా ప్రీతి అని గురుస్వాములు చెపుతుంటుంటారు. మాల ధరించిన నాటి నుంచి దీక్షా సమయం ముగిసి తిరిగి మాల విసర్జన చేసే సమయానికి కూడా దీక్షా పరుడి నుదిటిన చందనం బొట్టు ఉండాలి. చందనం బొట్టుకు తోడుగా కుంకుమ, విభూధి, గంధంలలో ఏదో ఒకదానిని పెట్టుకుంటారు.

## 41 రోజుల తరువాత శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయానికి..

అయ్యప్ప మాలధారణలో ఒక్కోమాలకు ఒక్కో ప్రాముఖ్యత ఉంటుంది. మొదటగా వేసుకునే వారిని కన్నెస్వామి అని నాలుగో సారి మాల వేసుకునే వారిని గద స్వామి, ఐదోసారి మాల వేసుకునేవారిని పేరుస్వామి, 6వ సారి వేసుకుంటే గురుస్వామిగా పిలుస్తారు. ఐతే ఇందులో గురు స్వామికి ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. గురుస్వామి అనే వారికి భక్తి భావం అలాగే ఓపిక పూజలు, భజనలు వచ్చి ఉండాలి. ఈ గురు స్వామీ లేనిదే మిగతా స్వాములు అయ్యప్ప మాలలు వేసుకోరాదు. గురుస్వామి పర్యవేక్షణలో మాత్రమే మిగతా స్వాములు మాలధారణ చేసుకోవాలి. మాల వేసుకున్న మొదటి రోజు నుండి విరమణ వరకు గురుస్వామి చెప్పినాదే శాసనం. 41 రోజుల తరువాత శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళ్ళడానికి ముందు గురుస్వామి చేతనే ఇరుముడి కట్టుకొని వెళ్ళాలి. ఒకవేల ఆలా చేయని యెడల అది అపచారం అని చరిత్ర చెబుతుంది. ఇలా ప్రతి విషయంలో గురు స్వామి లేనిదే..మిగతా స్వాములు ఏ పనిచేయరాదు.

## నియమాల అయ్యప్పమాల..

అయ్యప్ప మాలాధారణ చేసిన భక్తులు 41వ రోజుల పాటు(మండలం రోజులు) నియమ నిష్టలు పాటించాలి. ఇరుముడితో శబరిమల సన్నిధానం చేరి స్వామిదర్శనం చేసుకోవడంతో దీక్ష ముగుస్తుంది. 108 తులసీ, రుద్రాక్ష, ఎర్రచందనం, స్పటిక, మాలతో దీక్ష చేపట్టి ఒకటి ఉపమాలగా, ఏవైనా రెండు మాలలు వాటికి మధ్యలో స్వామి అయ్యప్ప లాకెట్ ధరించాలి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు, అస్తమయం తర్వాత చన్నీటితో స్నానం చేయాలి. ఉదయం, మధ్యాహ్నం భిక్ష సమయంలో, సాయంత్రం నిత్యపూజ ప్రత్యేక పీటం ఏర్పాటు చేసుకొని పూజ చేయాలి. సన్నిధానంలోనైనా చేయవచ్చు. నిత్యం ఉతికిన నల్లని వస్త్రాలనే ధరించాలి. దీక్షను చేపట్టేముందు కనీసం మూడు రోజుల ముందు సాత్వికాహారం తీసుకోవాలి. దీక్షా కాలంలో తల, గడ్డం, వెంట్రుకలు, గోళ్లను కత్తిరించకూడదు. పాదరక్షలు ధరించరాదు. దీక్షా సమయంలో ఒకసారి కనీసం తమ శక్తికొద్దీ ఐదుగురు స్వాములకైనా భిక్షపెట్టాలి. మధ్యాహ్నం ఒకపూట భిక్ష (భోజనం) చేయాలి. రాత్రి అల్పాహారం తీసుకోవాలి. అహింస, సత్రువర్తన, క్రమశిక్షణ, ఇంద్రియనిగ్రహం, బ్రహ్మచర్యం, కపటం లేకుండా ఉండాలి. మత్తు పానీయాలు తీసుకోకూడదు. ధూమపానం చేయవద్దు. దీక్షా సమయంలో కటిక నేలపై నిద్రించాలి. పురుషులు నాలుగేళ్ల వయస్సు నుంచి వృద్ధాప్యం వరకు ఈ దీక్ష చేపట్టవచ్చు. మహిళలయితే 10 సంవత్సరాల పిల్లలు, 50 ఏళ్ల పైబడిన వారు దీక్షను ఆచరించవచ్చు. దీక్ష చేపట్టని సందర్భాలు కుటుంబంలో తల్లి, తండ్రి మరణిస్తే ఏడాది పాటు మాల ధరించకూడదు. ఇంట్లో స్త్రీ ఏడో నెల గర్భిణి అయితే మాల వేసుకోవద్దు. భార్య మరణిస్తే ఆరు నెలల పాటు దీక్షకు దూరంగా ఉండాలి. దీక్ష మధ్యలో అవాంతరాలు, అశుభాలు ఎదురైనా

# ఈ బస్సు ప్రమాదాలను అడ్డుకట్టపడేనా!

మొన్న తెల్లవారుజామున ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగి కర్నూలు జిల్లాలో పలువురు సజీవ దహనమైన సంగతి తెలిసిందే. సరిగ్గా 10 రోజుల క్రితం రాజస్థాన్లోనూ ఇదే తరహా ప్రమాదం జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.ఇవే కాదు.. గత కొన్నేళ్లుగా స్లీపర్ బస్సుల్లో జరుగుతోన్న ప్రమాద ఘటనలు ప్రయాణికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. అందుకే వీటి నిర్వహణకు కఠిన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అతివేగం, భద్రతా ప్రమాణాల లేమితో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారి బస్సు ప్రమాదం రోడ్డు భద్రతపై కొత్త ప్రశ్నలు లేవనెత్తింది. వందలాది ప్రాణాలను బలి తీసుకుంటున్న ఈ ప్రమాదాల వెనుక ప్రధాన కారణం - అతివేగం. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ గణాంకాల ప్రకారం, 2022లో మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 72.26 శాతం (3,33,323) అతివేగం వల్ల జరిగాయి. 2023లో కూడా ఈ సంఖ్య పెద్దగా తగ్గలేదు 68.4 శాతం (3,22,795) ప్రమాదాలు వేగ నియంత్రణ లేకపోవడమే కారణం. పైగా దూర ప్రయాణ బస్సులు, ట్రక్కులు రాత్రి సమయంలోనే ఎక్కువగా నడవడం వల్ల డ్రైవర్లు నిద్రమత్తు లో వాహనం నడపడం జరుగుతోంది. ఒక్క క్షణం గమన దోషం ప్రాణాంతకం అవుతోంది. ప్రయాణికులు నిద్రలో ఉండడం వల్ల ప్రమాదం జరిగితే తప్పించుకునే అవకాశం కూడా తగ్గిపోతోంది. చాలా వరకు ప్రైవేట్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేవు. ఎమర్జెన్సీ ఎగ్జిట్లు సరిగా పనిచేయవు. ఇక ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు లేకపోవడం సాధారణం. ప్రయాణికులను ఆకర్షించేందుకు ఆకర్షణీయమైన లైట్లు, డెకరేషన్లతో బస్సులను తీర్చిదిద్దుతున్నా, భద్రతా ప్రమాణాలపై మాత్రం నిర్వాహకులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా స్లీపర్ బస్సులో 2%ఇ%1 సీటింగ్ ఉంటుంది. 30 నుంచి 36 బెర్త్‌లు ఉంటాయి. అదే మల్టీ యాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరు అడుగుల పొడవు.. 2.6 అడుగుల వెడల్పులో ఉంటుంది. అయితే బెర్త్‌ను అనుసంధానించే గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉండటంతో ఒకసారి ఒక వ్యక్తి మాత్రమే వెళ్లడానికి వీలుంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకైన ప్రాంతం నుంచి వేగంగా బయటకు రాలేకపోతున్నారు. స్లీపర్ బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతంగానే ఉంటున్నా.. సీట్ల మధ్యలో పరిమిత స్థలం వల్ల ప్రయాణికుల కదలికలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువమంది లోపల చిక్కుకుపోతున్నారని అభిప్రాయం. ఈ స్లీపర్ బస్సులు తొలుత పశ్చిమ దేశాల్లో నడిపేవారు. సిటీల మధ్య వినోద ప్రయాణాల కోసం వీటిని వినియోగించేవారు. ఆ తర్వాత సాధారణ ప్రజా రవాణాలో ఇవి భాగమయ్యాయి. అయితే, వీటిల్లో జరుగుతోన్న ప్రమాదాల కారణంగా కొన్ని దేశాలు స్లీపర్ బస్సుల వినియోగాన్ని తగ్గించుకుంటున్నాయి. చైనాలో 2012లోనే వీటి రిజిస్ట్రేషన్లను చైనా నిలిపివేసింది. ఇప్పుడు మన ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ రవాణా వాహనాల్లో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు కఠిన చర్యలు చేపట్టాయి. ఇకపై అన్ని కొత్త బస్సుల్లో (టూరిస్ట్, ట్రావెల్స్, ఆర్టీసీ, విద్యాసంస్థలు) అగ్ని ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరించే ఫైర్ అలర్ట్ సిస్టమ్, మంటలు ఆర్పేందుకు సిలిండర్లు, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయడం తప్పనిసరి. ఈ వ్యవస్థలు సరిగా అమలు చేసినప్పుడే వాహన రిజిస్ట్రేషన్ అనుమతిస్తారు. పాత బస్సుల్లోనూ దశలవారీగా ఈ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫిట్‌నెస్ రెన్యువల్ సమయంలో ఫైర్ సేఫ్టీ వ్యవస్థ లేకపోతే రెన్యువల్ ఇవ్వబోమని రవాణాశాఖ స్పష్టం చేసింది. ఈ చర్యలతో ప్రజా రవాణా బస్సుల్లో తరచుగా జరుగుతున్న షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగే అగ్ని ప్రమాదాలు తగ్గడం లక్ష్యం.

నియమాలను ఉల్లంఘించే బస్సు యజమానులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. ప్రమాదం జరిగినప్పుడు నామ మాత్రపు తనిఖీలు చేసి మమ అనిపించి చేతులు దులుపుకున్న తర్వాత వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని వారి వ్యాపారాన్ని కొనసాగిస్తాయి. అందుకే ఆర్‌టీఏ అధికారులు కేవలం ఈ రెండు మూడు రోజులు హడావుడి చేయకుండా ఈ ట్రావెల్స్ బస్సుల పత్రాలను తరచూ తనిఖీలు చెయ్యాలి.

# ఇక పాఠ్యాంశాల్లోకి కల్పనలేనా!

ప్రారంభమైన అరవై నాలుగేళ్ల తర్వాత ఎన్‌సీఈఆర్‌టీ తన అస్తిత్వాన్ని కోల్పోయింది. భారతదేశం ప్రజాస్వామ్య దేశమన్నది మరిచి, అధికారంలో ఉన్న వారికి అనుగుణంగా తిరోగమనంలోకి వెళ్లింది. జీవ పరిణామ సిద్ధాంతం- సైన్సు పాఠ పుస్తకాల్లోంచి తీసి వేయడమే కాకుండా, ఢిల్లీ సల్తనత్, మొఘ లుల ప్రసక్తి లేకుండా సిలబస్ ఏర్పాటు చేశారు. హిందూ తీర్థ స్థలాల విశేషాలు, కుంభమేళా వంటి ఆధ్యాత్మిక సంబంధిత విషయాలను 6నుండి 8వ తరగతి సోషల్ సైన్స్‌లో చేర్చారు. పాఠ్యాంశాల విషయంలో ఎన్‌సీఆర్‌టీ అహేతుకమైన నిర్ణయాలు తీసు కోవడమే కాకుండా, తాము హేతుబద్ధంగా ఈ మార్పులు చేర్పులు చేశామని చెప్పుకున్నది. అసలు హేతుబద్ధత అంటే ఏమిటీ? నిజాలు అంటే ఏవీ? అనే విషయాలు కేంద్ర ప్రభుత్వంలో ఉన్నవారికి తెలిసినట్టు లేదు. కనీసం ఆ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆ సంస్థ అధికారులకు కూడా తెలిసినట్టు లేదు. తెలిసినా, తమ స్వార్థ ప్రయోజనాల కోసం మనసులు చంపుకుని ప్రభుత్వాధినేతల సూచనల మేరకు విధులు నిర్వర్తిస్తున్నట్లుగా ఉంది. మనం మన రాజ్యాంగంలో రాసుకున్నట్టు వైజ్ఞానిక స్పృహకు విఘాతం కలుగుతున్నందువల్ల, భావితరాలన్నీ అంధకారంలో కూరుకుపోబోతున్నాయి గనక, దేశ పౌరులందరూ ఈ విషయాల మీద దృష్టి సారించాల్సి ఉంది! సహేతుకమైన పాఠ్య ప్రణాళిక కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సి ఉంది!! హిందూ తీర్థ స్థలాల విశేషాలు, అత్యంత అనాగరికమైన మహా కుంభమేళా గురించి ఒక కొత్త పాఠం చేర్చడం వల్ల ప్రపంచ జ్ఞానం కలుగుతుందా? వివేచన పెరుగుతుందా? అనవసరంగా హిందుత్వను, తమ హిందూ రాష్ట్ర సాధన ఉద్దేశాన్ని పసి పిల్లల మెదళ్లలోకి ఎక్కించే ప్రయత్నం చేయడం ఎందుకు చేస్తున్నారు? వీటితో పాటు ఒకప్పుడు దేశ విదేశాల్లో విస్తృత ప్రచారంలో ఉన్న బౌద్ధాన్ని నాశనం చేసిన ఘనుల వంశమైన శృంగ వంశం గురించి పిల్లలకు పాఠం పెడతారా? ఒకవేళ పెట్టినా వాస్తవ చరిత్ర బోధిస్తారన్న నమ్మకమేముందీ? అభూత కల్పనలతో కథలు అల్లి చెపుతారేమో? గత పదకొండేళ్లుగా అధికారంలో ఉన్న ఈ ఆర్‌ఎస్‌ఎస్- బీజేపీ ప్రభుత్వం అబద్ధాలతో విద్వేషాన్నే కదా ప్రచారం చేస్తున్నది! మీడియా సంస్థల్ని కొన్నది సరిపోలేదు. ఈడీ, సీబీఐ, కోర్టులు వంటి వ్యవస్థల్ని ధ్వంసం చేసింది సరిపోలేదు. అమెరికాకు గులాంగిరి చేస్తున్నది సరిపోలేదు. అందుకే ఇప్పుడు పాఠశాల విద్యార్థుల మెదళ్లు పాడు చేయడానికి ఒక కొత్త పథకం రూపొందించారు. గతంలో యూపీఏ అధికారంలో ఉండగా, వారి కాలంలో విధించిన 'ఎమర్జెన్సీ'కి సంబంధించిన పాఠం సోషల్ స్టడీస్‌లో ఉండేది. మరి అలాంటి ధైర్యం ఈ ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఎందుకు లేదు? ధైర్యముంటే తమ ఆధ్వర్యంలో జరిగిన గుజరాత్, మణిపూర్ మారణకాండలు పాఠాల్లో పెట్టాలి. చరిత్ర పాఠ్యాంశాల్లో మొఘలుల పరిపాలనా కాలాన్ని తొలగించినందుకు ఎన్‌సీఈఆర్‌టీ చెపుతున్న కారణాలు ఏవంటే, మొఘలులు పెద్ద ఎత్తున మత మార్పిడులు చేశారు, సొంత తండ్రుల్ని, అన్నదమ్ముల్ని చంపి రాజ్యాధికారం చేపట్టారు, హిందూ దేవాలయాల్ని కూల్చారు. హిందువుల్ని ద్వేష భావంతో చూశారు. వారిపై జిజియా పన్ను విధించారు. పైగా వారి మూలాలు ఈ దేశంలో లేవు. వారంతా దోపిడి దారులు, దేశాన్ని దోచుకునిపోయారని చెబుతున్నారు. మరి ఈ కారణాల్లో వాస్తవాలు ఎన్ని? అవాస్తవాలు ఎన్ని అనేది ప్రశ్న. హిందూ ప్రచారంలో ప్రముఖుల అభిప్రాయాల ప్రకారం పరిశీలిస్తే, స్వామి వివేకానంద ప్రకారం, మొఘలుల కాలంలో బెంగాల్‌లో ముస్లింల జనాభా పెరగడానికి కారణం, ఆ రోజుల్లో హిందువులైన భూస్వాముల, జమీందార్ల ఆగడాలు, హిందూ పురోహితుల కఠిన నియమాలు. వీటి నుంచి తప్పించుకోవడానికి పేద హిందూ రైతులు ఇస్లాంలోకి మారేవారు. దానివల్ల మొఘల్ చక్రవర్తి రక్షణ వారికి లభిస్తూ ఉండేది. ఇక కొందరేమో వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించి ఇస్లాం స్వీకరించేవారు. అంతేగాని, మొఘలులు బలవంతంగా అధికారికంగా హిందువుల్ని ఇస్లాంలోకి మార్చిన దాఖలాలు లేవు. అలా అని చరిత్ర పుటల్లో ఎక్కడా నమోదు కాలేదని చెప్పారు.. పైగా అణగారిన వర్గాల వారు నిరుపేదలు, నిరాశ్రయులు సైతం ముస్లింల పాలనలో అంటే మొఘలుల పాలనలోనే స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నారని నమోదు చేశారు.. మనం ఆలోచించినా.. మొఘలులు బలవంతంగా మత మార్పిడులు చేసి ఉంటే ముస్లింల జనాభా శాతం చాలా పెరగాల్సింది కదా? మరి ఆ రోజుల్లో హిందువులు 80-85 శాతమున్నారు కదా? పోనీ తర్వాత అయినా ముస్లిం జనాభా పెరిగారా అంటే అదీ లేదు.. 2011లో జరిగిన జనాభా లెక్కల్లో సైతం, ముస్లింల జనాభా 14-23 శాతం మాత్రమే ఉందని తేలింది! ఇక మొఘలులు స్వంత తండ్రుల్ని, కుటుంబీకులను చంపి రాజం హస్తగతం చేసుకునేవారు. ఇది నిజమే! అయితే ఈ విషయం కేవలం ముస్లిం రాజులకూ మొఘలులకూ మాత్రమే పరిమితం కాలేదుగా.. ప్రాచీన యుగంలో, మధ్య యుగంలో ఆధునిక యుగంలోనూ సింహాసనం కోసం, లేదా అధికారం కోసం, రాజు కుటుంబాలలో హత్యలు సర్వసాధారణంగా జరుగుతూ ఉండేవి. ఇందుకు అశోకుడు, హర్యాంక వంశం, గుప్త వంశం, రాజపుత్ర వంశాలు లేవా? ఆ రోజుల్లో రాజ్యం కోసం కుటుంబాలలో కుట్రలూ, హత్యలు సహజంగా జరుగుతూనే ఉండేవి. ఆ విషయం దాచిపెట్టి, మొఘలులను మాత్రమే క్రూరులుగా, చూపడం సరైంది కాదు. ఇక్కడ హిందూ ముస్లిం తేడా లేదు. రామాయణంలో మాత్రం ఏమైంది? వాలిని చంపించి సుగ్రీవుడు రాజ్యానికి రాలేదా? రావణున్ని చంపించిన విభీషణుడు రాజు కాలేదా? అహేతుకమైన నిర్ణయాలు తీసుకుని, తాము హేతుబద్ధంగా సిలబస్ మార్చామని చెప్పుకుంటున్న ఎన్‌సీఈఆర్‌టీ-కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి ఉంది.

# యానిమేషన్‌తో ప్రతిసృష్టి

మనకు సుపరిచితమైన స్పైడర్ మాన్, మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, ఫిలిమ్ అవతార్, బాహుబలి సినిమా, పౌరాణిక గాథల ఆనిమేషన్ చిత్రాలు లాంటి పాత్రల ప్రభావం మన మనసుల్లో సుస్థిరంగా నాటుకున్నాయి. షార్ట్ వాణిజ్య ప్రకటనలతో మొదలు పూర్తి నిడివిగల చలన చిత్రాల వరకు ఆనిమేషన్ కళకు సృజన జోడించి వినియోగించే స్థాయికి టెక్నాలజీ చేరడం సంతోషదాయకం. సమాజ శ్రేయస్సు కోరే పలు అంశాలను ఆనిమేషన్ కళలో ప్రత్యేకతలుగా, సరళంగా, స్పష్టంగా, అర్థవంతంగా, ఆకర్షణీయంగా తక్కువ సమయంలో గొప్ప భావాలను వ్యక్తం చేయవచ్చు. అక్టోబర్ 1892లో తొలి సారి పారిస్‌లో ఆనిమేషన్ చిత్రం ప్రదర్శించడం జరిగింది. దీనికి గుర్తుగా ఆనిమేషన్ కళకు పెరిగిన అపార ఆదరణను దృష్టిలో ఉంచుకొని వాణిజ్య, చలనచిత్రరంగాల్లో దాని ప్రాముఖ్యతను వివరించే సదుద్దేశ్యంతో "ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్" నేతృత్వంలో 2002 నుండి ప్రతియేటా 28 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవం(ఇంటర్నేషనల్ ఆనిమేషన్ డే)' పాటించుట జరుగుచున్నది.

ఆనిమేషన్ కళకు సృజనను జోడించి నూతనత్వాన్ని ఆపాదించడం, ఆనిమేషన్ కళ వైపుకు యువతను ఆకర్షించడం, ఆనిమేషన్‌లో వినూత్న భావాలను జోడించడం, ఆనిమేషన్ ఆర్ట్ గూర్చి కార్యశాలలు నిర్వహించడం, ప్రఖ్యాత ఆనిమేషన్ ఫిలిమ్‌లను ప్రదర్శించడం, ఆనిమేషన్ కళ వెనుక దాగిన వైజ్ఞానికశాస్త్రాన్ని వివరించడం, ఆనిమేషన్ కళలో నిష్ణాతులను సన్మానించడం లాంటి అంశాలను చర్చించేందుకు అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవ వేదికలను వినియోగించుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆనిమేషన్ ప్రక్రియకు విద్య, వినోదం, వాణిజ్యం, మార్కెటింగ్, శాస్త్రీయ అవగాహన, సృజనశీల కళ, గేమింగ్, సిమ్యులేషన్, సినిమా, షార్ట్ ఫిల్మ్, మెడికల్, రిటైల్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ లాంటి రంగాల్లో అనంతమైన అవకాశాలు, ప్రయోజనాలు ఉన్నాయి. నిజ జీవితాన్ని నకలు చేస్తూ బొమ్మల కదలికలతో చిత్రాలు తీయడాన్ని ఆనిమేషన్ నైపుణ్య కళ అంటారు. వాస్తవికతకు ఊహను జోడించి అందరికీ అర్థం అయ్యేలా సరళ, వినోదాత్మక చిత్రాల ద్వారా సందేశాన్ని ఇవ్వడం ఆనిమేషన్ ప్రత్యేకత. స్వల్ప వ్యవధిలో అధిక ప్రభావం చూపగల సామర్థ్యం ఆనిమేషన్ కళకు ఉంటుంది. ఆనిమేషన్‌లో సంప్రదాయ, 2డి, 3డి, మోషన్ గ్రాఫిక్స్, స్టాప్ మోషన్, కటౌట్ అండ్ కల్లాజ్, రోటోస్కోపింగ్, సెల్ ఆనిమేషన్ మొదలగు రకాలు ఉన్నాయి. సాధారణ జనాలతో కాకుండా వ్యాపారవర్గాలలో కూడా ఆనిమేషన్ కళ ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. డిజిటల్ విప్లవం, అంతర్జాల ప్రభంజనం నేపథ్యంలో ఆనిమేషన్ కళకు అపార ఆదరణ లభించింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ముఖ్యంగా సినిమాలు, టివీల్లో ఆనిమేషన్ కళ ప్రవేశంతో ఆ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

అన్ని వర్గాల, వయసుల ప్రజలను ఆనిమేషన్ కళ ఆకర్షిస్తున్నది. ఆనిమేషన్ వీడియోలతో సందేశాలను సులభంగా ఇవ్వడం, ఊహాత్మక పరిధికి అవధులు లేక పోవడంతో సృజనశీలత పెరగడం, వైద్యరంగంలో వినియోగపడడం, ఆకర్షనీయంగా ఉండడం, సులభంగా అవగాహనకు రావడం, వాణిజ్య ప్రకటనలతో ఆకర్షించడం, తేలికగా వేగంగా ప్రజలకు చేరడం, కంటికి ఇంపైన రంగుల చిత్రాలు తీయగలగడం లాంటి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. 1906లో స్టువార్ట్ బ్లాక్టన్ మొదటి ఆనిమేషన్ చిత్రం 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్' తీయడం జరిగింది. 1928లో వాల్ట్ డిస్నీ 'స్టీంబోట్ విల్లి' అనబడే ప్రథమ ఆనిమేటెడ్ కార్టూన్ ఫిల్మ్ తీయడం జరిగింది. 1937లో మొదటి పూర్తి నిడివిగల ఆనిమేటెడ్ 'స్నోవైట్' అనే చలనచిత్రాన్ని వాల్ట్ డిస్నీ తీశారు. 1993లో 3డి ఆనిమేషన్ సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది.ఆధునిక డిజిటల్ యుగపు యువత ఆనిమేషన్ కళ పట్ల ఆసక్తిని పెంచుకొని, ఆ రంగాన్ని తమ వృత్తిగా ఎంచుకొని, మరింత సృజనను జోడించి ప్రపంచ మానవాళికి నవ్య ఆనిమేషన్ దృశ్య రుచులను చూపుతారని ఆశిద్దాం.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు..!!

- జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలి..
- ఆర్డిఓ కి వినతి పత్రం అందజేసిన సిపిఎం నాయకులు.



**జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 27:** భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలపరిదిలోని కొమ్ముగూడెం గ్రామంలో ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ఇందిరమ్మ కమిటీలు, స్థానిక అధికారులు నిరుపేద లబ్ధిదారులను విస్మరించారని సిపిఎం పార్టీ కొమ్ముగూడెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాదర్బార్ లో. ఆర్డిఓ కి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ మాట్లాడుతూ కొమ్ముగూడెం గ్రామంలో అర్హులైన పేద గిరిజనులను ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో విస్మరించారని ఇది సరైనదికాదని ఇప్పటికే పక్కా ఇల్లు ఉన్నవారికి లేదా, ఆస్తిపరులకి ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేశారు పక్కా రాజకీయాలతో కేవలం రాజకీయ ప్రలోభాలకు గురిచేస్తూ ఇందిరమ్మ ఇళ్ళు ఎంపిక చేస్తున్నారని ఇది ఇందిరమ్మ కమిటీలకు స్థానిక కాంగ్రెస్ నాయకులకు సరైనది కాదని తక్షణమే జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్, పార్టీ గ్రామ శాఖ సభ్యులు భూక్య బిచ్చు, బానోతు రవి, శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు

# ప్రతిభకు గుర్తింపు - వారాల దేవయ్యకు బంగారు నంది అవార్డు

నటనతో దూసుకెళ్తున్న వారాల దేవయ్యకు దక్కిన సముచిత గౌరవం






**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన సినిమా నటుడు,షార్ట్ ఫిల్మ్ నటుడు వారాల దేవయ్య కు హైదరాబాద్‌లో స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన “సినిమా, దూరదర్శన్ యూట్యూబ్ కళాకారుల అవార్డుల ప్రదానోత్సవం”లో ప్రతిభావంతుడైన నటుడు వారాల దేవయ్యకు బంగారు నంది అవార్డు లభించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శక-నిర్మాత రేలంగి నరసింహారావు,దర్శకుడు పసుపునూరి శ్రీనివాస్, నిర్మాత రామ్ సత్యనారాయణ, అవార్డుల సంస్థాధినేత కె.వై. గిరిరాజు ముఖ్య అతిథులుగా హాజరై వారాల దేవయ్యకు బంగారు నంది అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వారాల దేవయ్య మాట్లాడుతూ “పేద సినీ,టీవీ కళాకారులను గుర్తించి ప్రోత్సహిస్తున్న స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ సంస్థాధినేత కె.వై. గిరిరాజు కృషి అభినందనీయమని, ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు” తెలిపారు. ఈ నేపథ్యంలో పలువురు జిల్లా,వేములవాడ పట్టణ ప్రజలు వారాల దేవయ్య బంగారు నంది అవార్డును కైవసం చేసుకున్న సందర్భంగా హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలియజేశారు.

# తాత్కాలిక మరమ్మతులతో అస్త వ్యస్థం..!!

- చప్టాపై మట్టి పోయాడంతో గోతులు మయం..
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు..



**జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 27:** జూలూరుపాడు మండలపరిధిలోని మాచినేనిపేట, వాగొడ్డు తండా గ్రామాల మధ్య ఎర్రవాగుపై గత పదిరోజుల క్రితం. ఇసుక లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్. ఇసుక లోడుతో వెళుతుండగా ఒక్కసారిగా చప్టా కుంగిపోవడంతో కాంక్రీట్ ముక్కలై ట్రాక్టర్ ట్రక్కు ఇరుక్కుపోయింది ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం సంభవించిన సమయంలో చప్టా సమీపంలో ద్విచక్ర వాహనాలు గాని ప్రజలు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో ట్రాక్టర్ బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ రాజ్ అధికారులు పర్యవేక్షణ చేసి తాత్కాలిక మరమ్మతులతో మట్టిని పోసి మమ అనిపించారు చప్ట పై మట్టిని పోయాడంతో గుంటల మయమై వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాబోయే తుఫాన్ వలన మరింత ఇబ్బందులు పడక తప్పదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# మల్లారం పాఠశాలకు మైక్ సెట్ వితరణ.

- రాఘవ స్టీల్ %డ% ఎలక్ట్రికల్ పెయింటింగ్ యజమాని.




**తల్లాడ, అక్టోబర్ 27 ప్రశ్నన్యూస్ :** విద్యార్థులు చదువుతున్న మల్లారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కు కటికి వెంకయ్య నాయుడు -లక్ష్మీ ల దంపతులు రు 10,000/- (పది వేల రూపాయలు) విలువైన మైక్ సెట్ ను మండల విద్యాధికారి నెమ్మకంటి దామోదర ప్రసాద్ చేతుల మీదగా వితరణ చేయడం జరిగింది.మల్లారం ప్రభుత్వ పాఠశాల కు ఎంతో అవసరమైన సౌండ్ సిస్టమ్ ను అందజేసిన రాఘవ స్టీల్స్ ఎలక్ట్రికల్స్ పెయింట్స్ అధినేత శ్రీ కటికీ వెంకయ్య నాయుడుకి తల్లాడ మండల విద్యాధికారి ఎన్ . దామోదర ప్రసాద్ మల్లారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి బాబు ,ఉపాధ్యాయులు పి. అనిల్ కుమార్, కామిరెడ్డి వేంకటేశ్వర రెడ్డి ,కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# అమర వీరుల త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకం

- బోయినిపల్లి ఏఎస్సై : మల్లేష్
- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సైకిల్ ర్యాలీ



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బుధవారం బోయినిపల్లి ఏఎస్ఐ మల్లేష్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.బోయినిపల్లి మండల కేంద్రంలో గల “ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్” వద్ద నుండి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ మల్లేష్ మాట్లాడుతూ, “దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమర వీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. వారి త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకం.యువతలో దేశభక్తి,సేవా స్ఫూర్తి పెంపొందించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశ్యం” అని తెలిపారు.ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు నినాదాలతో పాల్గొని ప్రజల్లో దేశభక్తి సందేశాన్ని చాటారు.

# ఆగని ప్రవేట్ పత్తి వ్యాపారుల దందా..!!

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రయివేట్ పత్తి కొంటర్లు.
- ప్రభుత్వ నిబంధనలు లెక్క చేయని పత్తి వ్యాపారులు..



**తల్లాడ (ప్రశ్నన్యూస్) అక్టోబర్ 27:** తల్లాడ మండలకేంద్రంలో అక్రమ పత్తి వ్యాపారుల ప్రయివేట్ దందా రోజు రోజుకు పెరిగిపోతుంది. ప్రతికల్లో అనేక కథనాలు వచ్చినప్పటికీ మాకేం కాదంటూ ప్రభుత్వ నిబంధనలు లెక్క చేయకుండా తమ వ్యాపారాన్ని నడిపిస్తూనే ఉన్నారు. కూత వేటు





దూరంలో ప్రభుత్వ సిసిఐ కేంద్రం ప్రారంభించినప్పటికీ ప్రైవేటు వ్యాపారుల చీకటి వ్యాపారం కొనసాగుతూనే ఉంది. అమాయక రైతులను మోసం చేస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. ప్రైవేట్ పత్తి వ్యాపారం అక్రమంగా జరుగుతుందని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులకు మీడియా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లగా అక్రమ వ్యాపారులపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ఓ జిల్లా అధికారి హెచ్చరికలు జారీ చేసినప్పటికీ. తల్లాడ ప్రైవేట్ పత్తి వ్యాపారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అదేవిధంగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి భాయ్ అక్రమ పత్తి వ్యాపారులకు నోటీసులు అందించి సిజు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. వాటిని కూడా ప్రైవేట్ వ్యాపారులు పట్టించుకోకుండా తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. గత ఏడాది మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు ఆటోల ద్వారా వివిధ జిల్లాలుకు రాష్ట్రాలకు వెళ్లి రైతులను మోసం చేసి పత్తిని తీసుకొచ్చి తల్లాడలో అమ్మకాలు చేస్తే ఆనాడు తల్లాడ పోలీసులు పలువురు యువకులపై బైండోవర్ కేసులు నమోదు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మరల అదే విధంగా యువకులు ఆటోల ద్వారా పత్తిని తల్లాడ తీసుకొచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. అలాంటి వారిపై పోలీసులు కూడా బైండోవర్ కేసు నమోదు చేసే చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తల్లాడ లో అక్రమ పత్తి వ్యాపారులపై కొరడాలు జూలుపించి రైతులకు న్యాయం చేయాలని. ప్రభుత్వ సిసిఐ కేంద్రం ద్వారా పత్తిని కొనుగోలు చేసే విధంగా అవగాహన కల్పించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# పరిశుభ్రత - ఆరోగ్యం పై విద్యార్థులకు డాక్టర్ కార్తీక్ అవగాహన

- మోడల్ స్కూల్‌లో వైద్య శిబిరం
- విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత ఆదేశాల మేరకు మండల వైద్యాధికారి డాక్టర్ రాచమల్ల కార్తీక్ పర్యవేక్షణలో బుధవారం ఈ శిబిరం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. విద్యార్థులకు ఆరోగ్యం, విద్య, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ కార్తీక్ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థులకు అందించే ఆహార మెనూ, వంటగదిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వంట చేసే సిబ్బందికి పరిశుభ్రత పాటించాలని, వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రఘునాథ్, హెల్త్ అసిస్టెంట్ బిల్ల అశోక్, ఆరోగ్య కార్యకర్త ఉషాదేవి, స్కూల్ హెల్త్ వర్కర్ తిరుమల, ఆశా కార్యకర్త సరళ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను పరిశీలించిన జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వీటీఏడీఏ ఆధర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి, విస్తరణ పనులను జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించారు.ఆలయ విస్తరణలో భాగంగా ప్రణాళిక ప్రకారం ఇప్పటివరకు చేపట్టిన కూల్చివేత పనులను ఆలయ, ఆర్%డ%బి అధికారులు ఇంచార్జి కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు.ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రచార రథం, ఆలయం ముందు రహదారి విస్తరణ,తదితర అభివృద్ధి పనులను పరిశీలించి,పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను ఇంచార్జి కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రగతిలో ఉన్న పనుల వివరాలను,కల్పించబోయే సౌకర్యాల గురించి సంబంధిత అధికారులు ఇంచార్జి కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్శనలో ఈఓ రమాదేవి,ఆర్డీఓ రాధాబాయి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, ఆర్ అండ్ బి ఈఈ నరసింహా చారి,వీటీఏడీఏ సీపీఓ అన్సారీ, నీటి పారుదల శాఖ ఈఈ కిషోర్,మున్సిపల్ కమీషనర్ అన్వేష్, తహాశీల్దార్ విజయ ప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

### గుడి చెరువు బండ్ సందర్శన

వీటీఏడీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న వేములవాడ గుడి చెరువు బండ్ ను జిల్లా ఇంఛార్జి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. బండ్ నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభించారు అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సందర్శనలో పర్యాటక సంస్థ ఎస్ఈ సరిత, వీటీఏడీఏ సీపీఓ అన్సారీ, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహాశీల్దార్ విజయ ప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై రూరల్ పోలీసుల దాడి

-ఇద్దరు వ్యక్తులు అదుపులో
- కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : నిరంజన్ రెడ్డి





**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** గ్రామాల్లో ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కరీంనగర్ రూరల్ పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై చర్యలు చేపట్టారు. చేగుర్తి గ్రామానికి చెందిన చామనపల్లి బాబు,సిద్ధ రమేష్ అనే ఇద్దరు వ్యక్తులు తమ యజమాని కుర్ర రాజేశం ఆదేశాల మేరకు మానేరు నది నుండి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్-ట్రైలర్లలో తరలిస్తుండగా, బొమ్మకల్‌లోని లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద రూరల్ పోలీసులు వారిని పట్టుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు పంపించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో అక్రమ ఇసుక రవాణాలో పాల్గొన్న వారు సైతం మళ్లీ అదే చర్యలకు పాల్పడితే, వారి వాహనాలను స్వాధీనం చేసుకొని కోర్టులో డిపాజిట్ చేస్తామని, అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



# తమిళ ప్రేక్షకులపై రంజిత్ ఫైర్

పా.రంజిత్.. గత పది పదిహేనేళ్లలో తమిళ నుంచి వచ్చిన గొప్ప దర్శకుల్లో ఒకడు. తొలి సినిమా 'అట్టకత్తి'తో మొదలుపెట్టి 'తంగలాన్' వరకు అతను విభిన్నమైన సినిమాలు తీశాడు. కేవలం రెండు సినిమాల అనుభవంతో సూపర్ స్టార్ రజినీకాంత్‌తో సినిమా చేసే అవకాశం అందుకుని వరుసగా ఆయనతో కబాలి, కాలా లాంటి వైవిధ్యమైన చిత్రాలు అందించాడు రంజిత్.కాకపోతే ఈ సినిమాలు అంచనాలను అందుకోలేకపోయాయి. రంజిత్ దాదాపుగా ప్రతి సినిమాలోనూ కుల వివక్ష చుట్టూనే కథలను నడిపిస్తుంటాడన్న సంగతి తెలిసిందే. రంజిత్ నిర్మాత అవతారం ఎత్తి పరిచయం చేసిన మారి సెల్వరాజ్ సైతం.. తన బాటలోనే సాగుతున్నాడు. మరోవైపు అగ్ర దర్శకుడిగా ఎదిగిన వెట్రిమారన్ సినిమాల్లో సైతం ఈ పాయింట్‌ను హైలైట్ చేస్తుంటాడు. ఐతే ఇలాంటి సినిమాలు తీస్తున్నందుకు తమను నిందించడాన్ని పా.రంజిత్ తప్పుబట్టాడు.తాము తమిళ సినిమాను వెనక్కి తీసుకెళ్తున్నామని కొందరు విమర్శలు చేస్తున్నారని.. కోలీవుడ్ నుంచి భారీ వసూళ్లు సాధించే సినిమాలు రాకపోడానికి తామే కారణం అనడం అన్యాయమని అతను మండిపడ్డాడు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో రంజిత్ నిర్మించిన 'బైసన్' సినిమా సక్సెస్ మీట్లో రంజిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "కాంతార లాంటి సినిమా పెద్ద సక్సెస్ అయిందంటే చాలు.. తమిళంలో ఇలాంటి చిత్రం రాలేదని అంటారు. మన దగ్గర ఇలాంటి భారీ వసూళ్లు సాధించి సినిమా ఏది అంటారు. వెంటనే నాలాంటి దర్శకులను టార్గెట్ చేస్తారు. నేను ఇన్నేళ్లలో ఏడు సినిమాలు మాత్రమే చేశాను. మారి సెల్వరాజ్ ఐదు సినిమాలే తీశాడు. వెట్రిమారన్ కూడా మూడేళ్లకు ఒక సినిమానే తీస్తాడు. కానీ మా ఫొటోలు పెట్టి తమిళ సినిమా మా వల్లే వెనుకబడిపోయిందని అంటారు. సంవత్సరానికి తమిళంలో 250-300 సినిమాలు తీస్తారు.

# రమ్యకృష్ణకు
## ఘోర అవమానం!



టాలీవుడ్ ఇండస్ట్రీలో సీనియర్ హీరోయిన్ రమ్యకృష్ణ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అప్పట్లో సూపర్ రజినీకాంత్, నందమూరి బాలయ్య, మెగాస్టార్ చిరంజీవి లాంటి ఎంతోమంది స్టార్ హీరోల సరసన సినిమాలు చేసి, ఇండస్ట్రీని షేక్ చేశారు రమ్యకృష్ణ.అలాంటి హీరోయిన్ రమ్యకృష్ణను ఐరన్ లెగ్ అని దారుణంగా ట్రోల్లింగ్ చేశారట. ఈ విషయాన్ని స్వయంగా రమ్యకృష్ణ తాజాగా వెల్లడించారు. జగపతిబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న జయమ్ము నిశ్చయమ్ము రా అనే షోకు నటి రమ్యకృష్ణ హాజరై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన కెరీర్ ప్రారంభంలోనే అందరూ ఐరన్ లెగ్ అంటూ దారుణంగా ట్రీట్ చేశారని ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలుగులో తన మొదటి చిత్రం భలే మిత్రులు. ఈ సినిమా సమయంలో తాను నటించిన అన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యాయని గుర్తు చేశారు. దీంతో ఇంట్లో వాళ్ళు కూడా నన్ను చదువుకోమని ఫోర్స్ చేశారని రమ్యకృష్ణ తెలిపారు. కానీ ఓ జ్యోతిష్కుడు మాత్రం, పెద్ద స్టార్ హీరోయిన్ అవుతావని సూచనలు చేశాడట. దీంతో మళ్లీ యాక్టింగ్ స్కూల్లో చేరి, సక్సెస్ అయినట్లు తెలిపారు. 1984 లో ఇండస్ట్రీలోకి వస్తే, 1991లో సక్సెస్ అందుకున్నానని పేర్కొన్నారు. ఆ తర్వాత వెనక్కి చూసుకోలేదన్నారు.

# నయనతారకు
# మరో ఆఫర్..!



నందమూరి బాలయ్య ఏడాదికి రెండు సినిమాలు చేసుకుంటూ ముందుకు దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అఖండ 2 సినిమాతో ఫుల్ బిజీగా ఉన్న నందమూరి బాలయ్య, మరో నెలలో కొత్త సినిమా ప్రారంభించనున్నారు.గోపీచంద్ మలినేనితో మరో సినిమా తీసేందుకు బాలయ్య సిద్ధమయ్యారు. %చీదీఖ% 111 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్న ఈ సినిమా నవంబర్ ఏడో తేదీన పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించుకోబోతున్నట్లు టాక్. ఇప్పటికే బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో వీరసింహారెడ్డి సినిమా వచ్చి సక్సెస్ అయింది. దీంతో మరోసారి గోపీచంద్ కు ఛాన్స్ ఇచ్చాడు నందమూరి బాలయ్య. ఇక ఈసారి మాస్ యాక్షన్ అంశాలతో పాటు రెండు కాలాలకు సంబంధించిన హిస్టారికల్ కథను గోపీచంద్ మలినేని సిద్ధం చేశాడట. టైం ట్రావెల్ లాంటి కథ అని చెబుతున్నారు. ఇందులో కూడా నందమూరి బాలయ్య డబుల్ రోల్ లో కనిపించే ఛాన్సులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ఈ సినిమా నుంచి మరో గాసిప్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ మూవీలో నయనతార హీరోయిన్ గా ఫైనల్ అయినట్లు చెబుతున్నారు. ఇప్పటికే బాలయ్యతో నయనతార చాలా అనే సినిమాలు తీశారు. హిస్టారికల్ కథ కావడంతో బాలయ్య సరసన నయనతార అయితేనే కరెక్ట్ గా ఉంటుందని గోపీచంద్ ఈ నిర్ణయం తీసుకున్నాడట. రెమ్యూనరేషన్ ఎంతైనా ఇచ్చేందుకు చిత్ర బృందం సిద్ధం అయిందని టాక్ వినిపిస్తోంది.

## సూర్య-46 మూవీలోకి
# స్టార్ బ్యూటీ ఎంట్రీ..



స్టార్ హీరో సూర్య, డైరెక్టర్ ఆర్.జే. బాలాజీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ మూవీ 'కరుప్పు'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఇక దీంతో పాటు తెలుగులో వెంకీ అట్లూరి దర్శకత్వంలో మరో మూవీ చేయబోతున్న విషయం తెలిసిందే. 'సూర్య-46'అనే వర్కింట్ టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది షూటింగ్ స్టార్ట్ కాబోతున్న ఈ చిత్రంలో తాజాగా ఓ స్టార్ బ్యూటీ కూడా యాడ్ అయినట్లు ఇచ్చారు మేకర్స్. ఇందులో రవీన్ టండన్ కూడా భాగం కాబోతున్నట్లు తెలుపుతూ.. 'ఎవర్ గ్రీన్ రవీన్ టండన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ాబతీఅఘ46 లోకి మిమ్మల్ని చేర్చుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మీతో ముందు ముందు ఉండబోయే అద్భుతమైన ప్రయాణం కోసం వేచి చూస్తున్నాము' అని తెలిపారు.

## తొలి భారతీయ
# సూపర్ షీ సినిమా



"శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ 'కిల్లర్' అనే సై-ఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా కనిపించనున్న ఈ చిత్రంలో విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఉర్వీష్ పూర్వజ్ సమర్పణలో ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. ఆదివారం ఈ మూవీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుది దశకు చేరుకుంటున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇండియా ఫస్ట్ సూపర్ షీ మూవీగా ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో..ఇలాంటి ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందుతోంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను



# పరిచయం నుంచి పరిణయం వరకు..

విష్ణు విశాల్ నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్, ట్రైలర్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మేకర్స్ 'పరిచయమే..' సాంగ్ రిలీజ్. జిబ్రాన్ ఈ సాంగ్‌ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. సామ్రాట్ అందించిన లిరిక్స్ అందర్నీ అలరిస్తున్నాయి. జిబ్రాన్, అభివి, భృత్త వోకల్స్ లవ్లీ ఫీల్‌ని యాడ్ చేశాయి. ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ జర్నీ హత్తుకునేలా ఉంది. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. విష్ణు విశాల్ 'ఎఫ్ఐఆర్' చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. 'ఆర్యన్' ఈనెల 31న విడుదల కాను ంది.

# మరో సినిమాకు పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్..!



టాలీవుడ్ స్టార్ హీరో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు రంగాల్లో కూడా దూసుకు వెళ్తున్నారు. రాజకీయాల్లో కొనసాగుతూనే ఇటు ఛాన్స్ దొరికినప్పుడు సినిమాలు చేస్తున్నారు. సినిమాలు చేసి చాలా మందికి ఉపాధి కల్పిస్తున్నారు పవన్ కళ్యాణ్. అలాంటి పవన్ కళ్యాణ్ ఇటీవల ఒజి సినిమాతో బంపర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో బిజీగా ఉన్నాడట పవన్ కళ్యాణ్. ఈ సినిమా రిలీజ్ డేట్ ఇంకా ఫైనల్ కాలేదు. త్వరలో దీనిపై క్లారిటీ రానుంది. అయితే అలాంటి పవన్ కళ్యాణ్ ఇప్పుడు మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓ న్యూస్ వైరల్ గా మారింది. అది కూడా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో పొలిటికల్ డ్రామా నేపథ్యంలో వచ్చే సినిమాకు పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. ఈ సినిమాకు దిల్ రాజు నిర్మాతగా వ్యవహరించే ఛాన్స్ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి దాదాపు 6 నెలలు పట్టే ఛాన్సులు ఉన్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన త్వరలో కూడా రాబోతుందట.

# ఆడపిల్లలతో అసభ్య ప్రవర్తన - అటెండర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ ధర్నా



**గంగాధర (ప్రశ్న న్యూస్)** గంగాధర మండలం, కురిక్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న యాకూబ్ 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న ఆడపిల్లలతో అసభ్యకరంగా మాట్లాడి, వారిని ఏఐ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ వేధింపులకు పాల్పడిన ఘటన తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నేతలు సోమవారం గంగాధర ఎక్స్‌రోడ్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేవలం అటెండర్‌ను మాత్రమే కాకుండా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యం, సంబంధిత ఎంఈఓ, డీఈఓలను కూడా సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వమే హామీ ఇవ్వాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలంటూ భాజపా నాయకులు పోలీసు, విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## స్తంభంపల్లి బ్రిడ్జి నిర్మాణంలో పూర్తిగా విఫలమైన పాలకులు - సిపిఎం ఆగ్రహం

**- బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లిలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు గత రెండు సంవత్సరాలుగా నిలిచిపోయి ఉండటంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ, “ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నా సమస్య పరిష్కారం కాని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది” అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని బ్రిడ్జి నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామంచ అశోక్, పులి బాబాయ్ తదితరులు పాల్గొన్నారు.ం

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య - కేసు నమోదు - దర్యాప్తు

**- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** పండుగ కోసం ఇంటికి వచ్చిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన పిట్టల ఆదిత్య (17), అలుగునూర్‌లోని ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ కాలేజీ హాస్టల్‌లో వసతి పొందుతున్నాడు. పండుగ సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన ఆదిత్య తిరిగి హాస్టల్‌కి వెళ్లడానికి ఇష్టపడక, సోమవారం ఉదయం సుమారుగా 10.30 గంటల సమయంలో బోయినిపల్లి శివారులో గంగిపల్లి మొండయ్య పొలంలో పత్తి మందు తాగాడని, తన కుమారుడు అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు తక్షణమే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆదిత్య మధ్యాహ్నం మృతి చెందినట్లు, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు బోయినిపల్లి సబ్‌ఇన్స్పెక్టర్ రమాకాంత్ తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో రాజన్నాలయంలో కొనసాగుతున్న కార్తీక దీపోత్సవం

**- సుహాసినీల ఆధ్వర్యంలో ఘనంగా దీపోత్సవం**

**- జ్యోతి ప్రజ్వలన చేసిన ఆలయ ఈఓ రమాదేవి**

**- దీపాల కాంతులతో విరాజిల్లుతున్న వేములవాడ రాజన్న క్షేత్రం**





**వేములవాడ (ప్రశ్న న్యూస్)** కార్తీక మాసం ప్రారంభంతో భక్తి పరవశంతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం పరిసరాలు వెలుగులతో ప్రకాశించాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు దేవస్థానం ఆధ్వర్యంలో అక్టోబర్ 22 నుంచి నవంబర్ 20 వరకు నిర్వహించనున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమాలలో భాగంగా సోమవారం సాయంత్రం భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈఓ ఎల్. రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పారు. ఈ సందర్భంగా ఈఓ రమాదేవి మాట్లాడుతూ కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకొని ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సుహాసినీల ఆధ్వర్యంలో దీపోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

**- వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : శ్రీనివాస్**

**- మనకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల సేవలను స్మరించుకుందాం**

**- వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ : చల్లా వెంకట్రాజం**

**- అమరవీరుల స్ఫూర్తితో సైకిల్ ర్యాలీ**

**- హన్మాజిపేటలో వేములవాడ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం**




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా (ఫ్లాగ్ డే) సందర్భంగా వేములవాడ రూరల్ పోలీస్‌ల ఆధ్వర్యంలో హన్మాజిపేట గ్రామంలో సైకిల్ ర్యాలీ



నిర్వహించారు. హన్మాజిపేట ప్రభుత్వ హైస్కూల్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ గ్రామమంతా తిరుగుతూ, ప్రజల్లో దేశభక్తి, పోలీస్ సేవల పట్ల గౌరవ భావం కలిగించేవిధమైన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ, “దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత” అని అన్నారు. అనంతరం రూరల్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, “పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి. సమాజం శాంతి, భద్రతలు కాపాడేందుకు వారు చేసిన సేవలు చిరస్మరణీయమని” అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, విద్యార్థులు, పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమర వీరులకు నివాళులు అర్పించారు.

## నిషేధిత జూదంలాంటి కార్యకలాపాలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయి

**- పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు అరెస్ట్**

**- రూ.40,210 నగదు, ప్లే కార్డ్స్ స్వాధీనం**

**- వేములవాడ రూరల్ ఎస్ఐ : చల్లా వెంకట్రాజం**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం, హన్మాజిపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను వేములవాడ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ చల్లా వెంకట్రాజం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి రామ్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, దేవయ్యలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.40,210 నగదు, ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ, “పేకాట వంటి అక్రమ కార్యకలాపాలు సమాజంలో చెడు ప్రభావం చూపుతాయి. ఇలాంటి పనుల్లో నిమగ్నమయ్యే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కట్టుబడి ఉన్నారని” అన్నారు.

## ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు మాజీ మంత్రి హరీష్ రావు క్షమాపణలు చెప్పాలి

**ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి**



**ఓయూ(ప్రశ్న న్యూస్)** మాజీ మంత్రి బిఆర్ఎస్ సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీష్ రావు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు క్షమాపణలు చెప్పాలని ఓయూ జెఏసి చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే హరీష్ రావు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ క్యాబినెట్ ను అవమానపరుస్తూ మాట్లాడడం అత్యంత బాధాకరమని కొత్తపల్లి తిరుపతి మండిపడ్డారు. క్యాబినెట్ అంశాలను బహిరంగంగా చర్చిద్దాం అంబేద్కర్ విగ్రహం దగ్గరికి రమ్మని ఎమ్మెల్యే హరీష్ రావుకు ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ సవాల్ విసిరారు. చర్చకు రాకుండా హరీష్ రావు వారి ఎమ్మెల్యేను పంపిస్తామని చెప్పడం సిగ్గుమాలిన చర్య అని అభిప్రాయపడ్డారు. బంజారాహిల్స్ మినిస్టర్ వసతి గృహంలో మంత్రి అడ్లూర్ లక్ష్మణ్ మీడియా సమావేశంలో కొత్తపల్లి తిరుపతి పాల్గొని మంత్రికి మద్దతు తెలిపారు. ఓయూ జేఏసీ, బహుజన విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

# సాయి చిత్ర నగర్ నుండి గోడౌన్స్, క్యాటరింగ్ ను తొలగించండి

**ఉప్పల్ ఉప కమిషనర్ కు ఫిర్యాదు చేసిన కాలనీవాసులు**

**జనావాసాల మధ్య అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకోరా**

**జరగరాని సంఘటన జరిగితే బాధ్యులు ఎవరు**



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** ఉప్పల్ మున్సిపల్ ఉప కమిషనర్ రాజు కి రామంతపూర్, సాయి చిత్ర నగర్ కాలనీవాసులు , ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో సాయి చిత్రానగర్లో అక్రమంగా వెలసిన, ఎటువంటి అనుమతులు లేని, ప్రజలు నివసించేటటువంటి ప్రాంతంలో గోడౌన్స్ నిర్వహించడం వలన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాత్రిపూట గోడౌన్స్కు వస్తున్నటువంటి వెహికల్స్ ధ్వని వలన నిద్ర ఉండడం లేదని, వెహికల్స్ నుండి వచ్చే శబ్దాలు , లోడింగ్ మరియు అన్లోడింగ్ చేసే వ్యక్తులు బాగా తాగి ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తించడం జరుగుతుందని తెలియజేశారు. జనవాసాల మధ్య ఇలాంటి గోడౌన్స్, క్యాటరింగ్ నిర్వహించడం వలన అగ్నిప్రమాదం సంభవించినట్లయితే, ఎవరు బాధ్యత వహిస్తారని గత సంవత్సరం దీపావళి పండుగ నాడు, అగ్నిప్రమాదం సంభవించిందని ఆ సమయంలో వచ్చినటువంటి అధికారులు తూతూ మంత్రంగా 5000 రూపాయలు ఫైన్ వేసి చేతులు దులుపుకున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు వెంటనే చర్య తీసుకొని జనవాసాల నుండి, దూరంగా గోడౌన్స్ మరియు షెడ్లు క్యాటరింగ్ తదితర కంపెనీలను తరలించాలని, ఆర్.టి.ఐ చట్టం ప్రకారం గోడౌన్ ల అనుమతులు, కమర్షియల్ ప్రాపర్టీ టాక్స్, అనుమతులు ఎవరిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా ఎందుకు ఇచ్చారో తెలియజేయాలని కమిషనర్ ని కోరడం జరిగింది. వారం రోజుల్లో గోడౌన్స్ మరియు క్యాటరింగ్ వారిపై చర్య తీసుకొని, శివారు ప్రాంతాలకు తరలించాలని, లేనిచో కాలనీవాసులు అందరం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని, కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి పరమేశ్వర చారి, వేములకొండ సోమశేఖర్ గౌడ్ ,మల్లయ్య యాదవ్, రామచంద్రారెడ్డి, వేణు, సీతారాం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పంటలకు విలువ కల్పిస్తాం

**- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : వన్నెల రమణారెడ్డి**

**- ప్రతీ రైతు ధాన్యం ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు**

**- బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్**

**- వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

**- రైతులకు భరోసా కల్పిస్తున్న కాంగ్రెస్ నేతలు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని దుంద్రపల్లి, అనంతపల్లి, మల్కాపూర్, స్థంభంపల్లి, రత్నంపేట, దేశాయిపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బోయినిపల్లి మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి నేతృత్వంలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి మాట్లాడుతూ, “రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర దక్కేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సమస్యలు ప్రాధాన్యతగా పరిష్కరించబడుతున్నాయి” అని అన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, “ప్రతీ రైతు వరిధాన్యం ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకునేలా పూర్తి పారదర్శకతతో కొనుగోలు కేంద్రాలు నడుస్తాయి. రైతులు ఎటువంటి ఆందోళన లేకుండా ధాన్యం తీసుకురావాలి” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, మండల తహశీల్దార్, ఎంపీడీఓ, తదితర అధికారులు, గ్రామ స్థాయి నాయకులు, రైతులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## జననేత జన్మదిన వేడుకలకు సర్వం సిద్ధం

**అందరు హాజరవ్వాలని పిలుపునిచ్చిన రాష్ట్ర నాయకులు తూము చౌదరి**

**లక్ష్మీదేవిపల్లి (ప్రశ్న న్యూస్)** జనహృదయ నేత, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రధాత, పేదల సొంతింటి కలను సాకారం చేసిన ధీశాలి, రైతు బాంధవుడు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. మంగళవారం పొంగులేటి పుట్టినరోజును లక్ష్మీదేవిపల్లి మండలంలో ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తూము చౌదరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. మండలంలో గ్రామాల వారీగా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పొంగులేటి శ్రీనన్న అభిమానులతో పాటు, వివిధ వర్గాల ప్రజలు, సంఘాల ఆధ్వర్యంలోనూ పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేశారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఎక్కడికక్కడ కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమయ్యారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రం విశ్వరూప థియేటర్, హేమచంద్రపురం, రేగళ్ల, లక్ష్మీపురం, మైలారం, సీతారాంపురం, చాతకొండ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము చౌదరి ఆధ్వర్యంలో అన్నప్రసాద నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇంతే కాక వృద్ధాశ్రమాలు, అనాధాశ్రమాల్లోనూ అన్నదానం, వీటితోపాటు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీకి సిద్ధమవుతున్నారు. పార్టీ శ్రేణులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, పొంగులేటి అభిమానులు, ముఖ్యంగా యువత ఇందులో పాల్గొనాలని తూము చౌదరి పిలుపునిచ్చారు.



# నకిలీ వైద్యుల ఉచ్చులో.. పేద రోగులు

## అన్ని రోగాలకు ఒకే వైద్యం

- మెడికల్ షాపులపై తనిఖీలు మరిచిన ఔషద నియంత్రణ అధికారులు
- పుట్టగొడుగుల్ల పుట్టుకొస్తున్న మందుల షాపులు
- కనీస విద్యార్హతలు లేకున్న డాక్టర్లుగా చలామణి
- రోగ లక్షణాలు చెప్పితే చాలు మందుల షాపులో మందులిస్తారు
- నర్సింగ్ హెూమ్స్, డెలివరీలు, చిన్న చిన్న శస్త్రచికిత్సలు చేస్తున్న నకిలీ వైద్యులు
- దావాఖాణలకు అనుబందంగా మందుల షాపులు, ల్యాబ్ లు
- సాధారణ జబ్బలకు సైతం భారీ ఆంటిబయోటిక్స్ వాడడంతో సైడ్ ఎపెక్టులతో రోగుల భాదలు
- వెంటనే ప్రభుత్వ సందించి నకలీ వైద్యుల పట్ల దృష్టి సారించాలి
- నిబందనలు పాటించను మందుల షాపులపై చర్యలేవి

**హైదరాబాదు (ప్రశ్న న్యూస్)** వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల విచిత్ర పరిస్థితులు నెలకొని అంతుచిక్కని రోగాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుచుండగా దీన్ని ఆసరాగా చేసుకొని పుట్టగొడుగుల్ల పుట్టుకొస్తున్న దావాఖాణలు, మందుల షాపులు ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుచున్నాయి. ఒక పెద్ద డాక్టర్ వద్ద పనిచేస్తు అతని ఆస్పత్రికి ప్రక్కనే దుకాణం తెరిచి మిడి మిడి జ్ఞానంతో తెలిసి తెలియని వైద్యం చేస్తు జనాలను ప్రాణాపాయస్థితిలోకి నెడుచున్నారు. అలాగే తన దుకాణం ప్రక్కనే మందుల షాపు, దానిప్రక్కనే ల్యాబ్ సదుపాయాలను కల్పించి ప్రజలను నిండా ముంచుతున్నారు. ఏ జబ్బుకు ఏ వైద్యం చేయాలనే కనీస జ్ఞానంలేని వారుకూడా పెద్ద డాక్టర్ల మాదిరిగా చలామని అవడం గమనార్హం. ఇక కనీస విద్యార్హతలు కూడాలేని వారు ఏకంగా నర్సింగ్ హెూమ్స్ నడుపుచుండడం సంచలనం కల్గించే విషయం. ఇలా నకిలీ డాక్టర్ల భాగోతం రాష్ట్రమంతట యద్దేశ్చగా సాగుతున్నను సంబందిత అధికారుల దృష్టికి రాకపోవడం విచారకరం. ముఖ్యంగా స్లమ్ ఏరియాలను లక్ష్యంగా చేసుకొని నకిలీ డాక్టర్లు తమ కార్యకలాపాలను నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. ఇక మెడికల్ షాపులు పెట్టాలంటే అనేక నిబందనలను పాటించాల్సి ఉంది. కాని నకిలీ డాక్టర్లు తమ దుకాణంలోనే మందుల విక్రయాలు కొనసాగిస్తు ప్రజలను నిలువు దోపిడి చేస్తున్నారు. సాధారణ జలుబుతో వచ్చే రోగులను భయభ్రాంతులకు గురిచేసి ఇంజక్షన్లు, మాత్రలతో పాటు సలేన్ పెట్టి వేలకు వేలు దోచుకుంటున్నారు.ఇదిలా ఉండగా సాధారణ అనారోగ్య సమస్యలకు సైతం బలమైన ఆంటిబయోటిక్స్ తో వైద్యం చేయడం వల్ల సైడ్ ఎపెక్ట్ సమస్యలు వచ్చి రోగులు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటుండడం విచారకరం.

### నిబంధనలు పాటించని మందుల షాపులు

నిబందనలను తుంగలోత్రోక్కి పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నా మందుల షాపులపై పర్యవేక్షణ పూర్తిగా కరువై పోయింది. వాడ వాడల కిరాణా షాపుల కంటే అధికంగా మందుల షాపులు ఉండడం గమనించాల్సిన విషయం. మరి మెడికల్ షాపుల నిర్వాహణ కోసం సంబంధిత శాఖా అనుమతుల పత్రాలతో



పాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి డ్రగ్స్ ఇన్సి పెక్టర్ ద్వార అనుమతులను పొందాల్సి ఉండి కేవలం పార్మాసిస్ట్ పరివేక్షణలో మందుల విక్రయం కొనశాగించాలి. కాని పూట్ పాత్ వ్యాపారంగా మారిన మందుల షాప్స్ చాలా వరకు బినామీ పేర్లతో ఫార్మాసిస్టులు లేకుండానే మందుల విక్రయాలు చేస్తున్నారు. ఇక ఆశ్చర్యకర విషయమేమంటే మెడికల్ షాపులకు వెళ్లి జబ్బు లక్షణాలు చెప్పితే చాలు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ కూడా అవసరం లేకుండా కనీసం ఇంటర్ వరకు కూడా చదవని వారు ఏ మందులు ఎన్ని రోజులు వాడాలో చెబుతు వైద్యం చేస్తున్నారు. ఈ తతంగమంతా సంబంధిత శాఖ అధికారులతో మందుల షాపుల యజమానులు కుమ్మక్కై వారి అఐడదండలతో అడ్డగోలుగా తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారని సమాచారం.

### ముడుపులు ఇస్తే చాలు అర్హత లేకున్నా లైసెన్సులన్ని ఇంటివద్దకే

ప్రస్తుతం మార్కెట్లో అత్యంత ప్రాచూర్యం పొందిన వ్యాపారం మెడికల్ షాపుల దందానే. మెడికల్ షాపుల నిర్వహణకు ఎలాంటి అర్హత లేకున్నాను సంబంధిత అధికారులను సంతృప్తిపరిచి అడిగినంత డబ్బు సమకూర్చితే చాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులువుగా లైసెన్స్ తో పాటు మెడికల్ అసోసియేషన్ లో సభ్యత్వం ఇస్తున్నారని సమాచారం. అలాగే ఏడాది ఒక్కసారి ప్రతి మెడికల్ షాపు నుంచి మరో 5-10 వేల చొప్పున వసూళ్లు చేస్తున్న డ్రగ్స్ కంట్రోల్ అధికారులు షాపుల తనిఖీలు, షాపులపై కేసు రాయకుండా మేనేజ్ చేస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం.

### నాణ్యత లేని మందులు విక్రయిస్తు

ప్రజల ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టి కేవలం ధనార్జనే ధ్యేయంగా మెడికల్ షాపుల దందాను కొనసాగిస్తున్నారు. ఇందుకోసం అధిక లాభాలు వచ్చే నాణ్యత లేని మందులను రోగులకు అంటగడుతు వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. షాపులో ఏది అందుబాటులో ఉంటే అది దేనిపై ఎక్కువ లాభం ఉంటే ఆ మందులనే రోగులకు ప్రతిపాదిస్తున్నారు. అనుమతులు లేని కొన్ని మందులను సైతం గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకుని సొమ్ము చేసుకోవడం గమనార్హం

### జాడే లేని తనిఖీలు

ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న మెడికల్ షాపుల పై డ్రగ్ కంట్రోల్ అధికారుల తనీఖీలు కొరవడిన్నాయి. నిత్యం మెడికల్ షాపులపై నిఘా పెట్టి అకస్మిక తనిఖీలతో ప్రజలకు నాణ్యమైన మందులు అందేలా చూడాల్సినొ అధికారులు మామూళ్ల మత్తులో పడి తమ భాధ్యతలను విస్మరించడంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఎప్పుడు వస్తారో ఎప్పుడు తనిఖీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా ఔషధ నియంత్రణ అధికారులు స్పందించి అర్హత లేని మెడికల్ షాపులపై తగు చర్యలు తీసుకోవాలని జనాలు కోరుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి నకిలీ వైద్యులతో పాటు, అనుమతులతో పాటు నిబంధనలను పాటించని మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇవి రోడ్లు కావు... యమపాషాలు

## కోర్టు , కె ఎల్ ఆర్ లో గుంతల మయంగా మారిన రోడ్లు







- ఆదమరిసీ ప్రయాణం చేస్తే
- ఇక అంతే సంగతులు
- రోడ్లు మరమ్మత్తులు చెయ్యాలని అధికారులకు విజ్ఞప్తులు

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కోర్టు, కేఎల్ఆర్ వెంచర్ లోని రోడ్లు యమపాషాలుగా మారాయి. ఈ రోడ్లపై ఆదమరిసి ప్రయాణం చేశారో ఇక అంతే సంగతులు. ఈ రోడ్లపై అడుగడుగునా గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఈ రోడ్లు గుంతల మయంగా మారాయి. నిరంతరం రద్దీగా ఉండే కోర్టు, కేఎల్ఆర్ రోడ్లు మొత్తం శిథిలావస్థకు చేరడంతో వాహనదారుల అవస్థలు పడుతున్నారు.

### కోర్టు రోడ్డు దుస్థితి..

కోర్టు రోడ్డు.. లాయర్లు.. కోర్టుకు వచ్చే వారితో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. అలాంటి రోడ్డు పై పెద్ద పెద్ద గుంతలు పడడం వల్ల వాహనదారులు, కాలినడకన వచ్చే వారు సైతం తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రోడ్డుకు అడుగడుగునా పెద్ద పెద్ద గోతులు పడడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఏదో ఒక పని పైన కోర్టుకు నిరంతరం వస్తుంటారు. ఇదే రోడ్డుపై ప్రయాణం చేస్తుంటారు . రోడ్డుపై పడ్డ గుంతలను చూసి ఊరుకుంటున్నారే తప్ప వాటిని మరమ్మత్తులు చెయ్యాలన్న సోయే లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.. పట్టణానికి నడిబొడ్డున ఉన్న కోర్టు రోడు దుస్థితి ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు ఏ విధంగా ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. గుంతలు పడ్డ రోడ్ల పైన జరగరాని ప్రమాదం ఏమైనా జరగకముందే వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



### కెఎల్ఆర్ వెంచర్ లోని రోడ్డు..

కేఎల్ఆర్ వెంచర్ లోని రోడ్డు సైతం మరింత దారుణంగా ఉంది. రోడ్డుపై పడ్డ పెద్ద పెద్ద గోతులలో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందడంతో పాటు నిలిచిన నీరు వల్ల గోతులు కనిపియ్యకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ వ్యాపార, వాణిజ్య సంస్థలు, వారాంతపు సంత జరగడం వల్ల ఈ రోడ్డు ఎప్పుడు బిజీగా ఉంటుంది. విద్యార్థులు, స్థానికులతో పాటు వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు ఎప్పుడు సందడిగా ఉంటుంది. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రోడ్డుపై అడు అడుగున గోతులు పడి యమపాషాలుగా తయారయ్యాయి. రోడ్డుపై పడ్డ పెద్దపెద్ద గోతుల వల్ల నడవడానికి సైతం వీలు లేకుండా తయారయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి కోర్టుతోపాటు కెఎల్ఆర్ వెంచర్ లోని రోడ్లకు మరమ్మత్తులు చేయాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష

## - రాష్ట్రవ్యాప్తంగా రూ.33,630 కోట్ల విలువైన పనులు



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రూ. 33,630 కోట్ల విలువైన రైల్వే పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ కీలక ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమీక్షలో పలు ముఖ్యమైన రైల్వే లైన్ల పనుల పురోగతిపై అధికారులు నివేదిక సమర్పించారు. ముఖ్యంగా నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్, గుణదల-ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్-తుముకూరు మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు ఎంతవరకు వచ్చాయో చర్చకు వచ్చింది. వీటితో పాటు, రాష్ట్రంలో కొత్తగా చేపట్టాల్సిన రైల్వే లైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ), అండర్ బ్రిడ్జి (ఆర్ యూబీ)ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖకు పంపిన ప్రతిపాదనలపైనా సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వేలకు చెందిన పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

# కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్ ఓవర్ యాక్షన్..



కాప్రా (ప్రశ్న న్యూస్)దప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహించే కొంతమంది అటెండర్లో ఓవరాక్షన్ అంతా ఇంతా కాదు. అధికారుల కంటే వాళ్లే పెద్ద తోపులుగా భావించడం సర్వసాదరంగా మారింది. అధికారులను కలవడానికి వస్తున్న విలేకరులన కావాలని అటెండర్లు అడ్డుకోవడం పై స్థానిక విలేకరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా కాప్రా తహసిల్దార్ కార్యాలయంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎంఆర్ఓ ను కలవాలని వెళ్లిన విలేకర్లతో అటెండర్ నిర్లక్ష్యం వ్యవహరించారు. పైరవీల కోసం వచ్చిన వారికి ఇచ్చిన ప్రాదాన్యత కూడ ఇవ్వక పోవడంతో అవమానంగా బావించి అక్కడి నుండి మీడియా ప్రతినిధులు వెళ్లిపోయారు. అధికారుల వద్ద అటెండర్ల పద్ధతి మార్చుకోవాలని సమాచారం కోసం వచ్చే విలేకర్లకు సమయం ఎంతో ముఖ్యమైనదని ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్ట్ లు అధికారులకు సూచించారు. అధికారులకు వాళ్ల వద్ద విధులు నిర్వహించే అటెండర్లకు పద్ధతులు నేర్పించాలని లేకపోతే అధికారులకు ఇబ్బందులు తప్పవని పలువురు సూచిస్తున్నారు.

# అమెరికాలో విమాన సర్వీసులపై షట్ డౌన్ ఎఫెక్ట్

## - వేలాది విమానాల ఆలస్యం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికాలో విమానయాన సంస్థల్లో సిబ్బంది కొరత ఏర్పడింది. ప్రభుత్వ షట్ డౌన్ కారణంగా జీతాలు అందకపోవడంతో సిబ్బంది విధులకు హాజరుకావడంలేదు. తాత్కాలికంగా ఫుడ్ డెలివరీ బాయ్ లు గా మారిపోయారు. జీతాల్లేకుండా పనిచేయడం తమవల్ల కాదని చెబుతున్నారు. దీంతో సరిపడా సిబ్బంది లేక ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫలితంగా విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఆదివారం ఒక్కరోజే దాదాపు 8 వేలకు పైగా విమానాలు ఆలస్యంగా నడిచినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన 22 ప్రాంతాల్లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది కొరత ఏర్పడిందని అమెరికా రవాణా మంత్రి శాన్ డఫీ వెల్లడించారు. ప్రభుత్వ షట్ డౌన్ ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో సిబ్బంది కొరత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీంతో విమానాలు ఆలస్యంగా నడవడం, సర్వీసులను రద్దు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని వివరించారు.

### ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం..

సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌లో దాదాపు 2 వేల విమానాలు, అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 1200 విమానాలు, యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 739, డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన 600 విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588